
పిడుగురాళ్ల ధర్నాలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



ఈఆర్‌వోల గుండెల్లో లబ్..డబ్

- నేడు, రేపు విజయవాడలో సీఈసీ, ఈసీలు
- పూర్తి కసరత్తుతో మూడు జిల్లాల అధికారులు
- ఓటర్ల జాబితాల్లో అక్రమాలపై ఫిర్యాదు చేయనున్న చంద్రబాబు, పవన్
- గుంటూరు పశ్చిమలో జరిగిన అక్రమాలను చంద్రబాబుకు నివేదించిన పార్టీ శ్రేణులు

నరసరావుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కమిషనర్ రాజీవ్‌కుమార్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు అరుణ్‌గోయల్, అనూప్‌చంద్ర పాండే మంగళవారం నుంచి రెండు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనుండటంతో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, ఈఆర్‌వోల, బీఎల్‌వోల గుండెల్లో రైళ్లు పరుగెడుతోన్నాయి. సీఈసీ, ఈసీలు రాష్ట్ర, జిల్లా ఎన్నికల అధికారులతో సమావేశమై ఇప్పటివరకు ఎస్ఎస్ఆర్-2024కు సంబంధించి క్లైయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార పురోగతిపై సమీక్షించనున్నారు. అలానే సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత పైనా చర్చించనున్నారు. అలానే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అధ్యక్షులతోనూ సమావేశమై ఫిర్యాదులు స్వీకరించనున్నారు. సీఈసీనే స్వయంగా హాజరౌతుండటంతో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో పాటు ఇతర పార్టీల ముఖ్య నేతలు కూడా హాజరై ఫిర్యాదులు అందజేయాలని నిర్ణయించారు. దీంతో ఎవరిపై సీఈసీ కన్నెర్ర చేస్తారోనని అంతా భయపడిపోతున్నారు.

గుంటూరు జిల్లా ఫాం-7లపై అధికారుల ఉదాసీనం

స్పెషల్ సమ్మరి రివిజన్ - 2024 ప్రారంభమైన తర్వాత గుంటూరు నగరంలో పెద్దసంఖ్యలో బోగస్ ఫారం-7లను వైసీపీ నేతలు వారి అనుచరుల ద్వారా పెట్టించారు. ప్రతిపక్ష టీడీపీ, జనసేనకు సానుభూతిపరులుగా ఉండే ఓటర్ల పేర్లను లిస్టుల్లో నుంచి తొలగించడమే లక్ష్యంగా గంపగుత్తగా దరఖాస్తులు చేయించారు. నవంబరు 2 నుంచి 5వ తేదీ మధ్యన దాదాపుగా 2,500లకు పైగా ఓటు తొలగింపు దరఖాస్తులు చేయించారు. ఇవి ఎక్కువగా శేషిరెడ్డి కొండా, శేషిరెడ్డి చల్లా, వెంకాయమ్మ సిద్ధే, రాము లన్నలబౌతుల, వెంకటరెడ్డి పులుసు, సంజీవరెడ్డి అనం పేర్లతో పెట్టించారు. దీనిపై తెలుగుదేశం పార్టీ నేతలు అభ్యంతరం పెట్టడంతో ఈసీ ఆదేశాల మేరకు రిటర్నింగ్ అధికారి సమక్షంలో విచారణ జరిగింది. విచారణలో తప్పుడు ఫారం-7లను అని తేలినప్పటికీ కఠినమైన సెక్షన్లు పెట్టకుండా బెయిలబుల్ సెక్షన్లు పెట్టి పోలీసు కేసు నమోదు చేయించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 9-8-34లో ధనలక్ష్మి సంగీత విద్యాలయం ఉండగా అక్కడ 60 ఓట్లు చేర్చారు. అలానే 9-1-19లో 85 ఓట్లు ఉంటే టీడీపీ ఫిర్యాదు మేరకు ఇప్పటివరకు 45 మాత్రమే తొలగించారు. కాగా మంత్రి విడదల రజని గుంటూరు పశ్చిమ వైసీపీ సమన్వయకర్తగా నియామకం కావడంతో ఆమె తన ఓటును చిలకలూరిపేట నుంచి బదిలీ చేసుకొనేందుకు తప్పుడు సమాచారంతో ఫారం-8 పెట్టారు. 9-2-98 డోర్ నెంబరులో ఖాళీ స్థలం ఉండగా అక్కడ తాను నివసిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై కూడా టీడీపీ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో చనిపోయిన ఓటర్ల పేర్లను అలానే కొనసాగించారు. వాటిని తుది ఓటర్ల జాబితా ప్రచురణ నాటికి తొలగిస్తామని అధికారులు చెప్పారు. అయితే ఎన్ని తొలగించారనేది తెలియాల్సి ఉన్నది. డోర్-టూ-డోర్ పరిశీలనలో 27,297 మంది స్థానికంగానే నివాసం ఉంటున్నట్లు తేలింది. దాంతో వారి ఓట్లను తిరిగి ఓటర్ జాబితాలో చేర్చారు. అయితే రాజకీయ పార్టీలు వారి ఓట్ల తొలగింపునకు గతంలో దరఖాస్తులు పెట్టగా వాటిని బీఎల్‌వో, ఏఈఆర్‌వో, ఈఆర్‌వోలు ఆమోదించారు. ఎవరైతే తప్పుడు నిర్ణయాలు తీసుకొన్నారో వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని రాజకీయ పార్టీల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నాయకులు ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబుని కలిసి ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం, వైసీపీకి పక్షపాతంగా వ్యవహరిస్తుండటంపై ఫిర్యాదు చేశారు. ఆయా ఆధారాలను చంద్రబాబు మంగళవారం సీఈసీకి ఇవ్వనుండటంతో ఎన్నికల సంఘం ముఖ్య కమిషనర్, కమిషనర్లు వాటిపై ఏవిధమైన చర్యలు తీసుకొంటారోనన్న ఉత్కంఠ నెలకొన్నది.

సోమవారమే విజయవాడకు బాపట్ల కలెక్టర్, ఎస్పీ

జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం సాయంత్రమే విజయవాడ బయల్దేరి వెళ్లారు. సీఈవో సమీక్ష ఖరారు అయిన దగ్గర నుంచే జిల్లా అధికారులు దానికి సంబంధించిన నివేదికలను తయారు చేసే పనిలో నిమగ్న మయ్యారు. ఆదివారం ఎస్పీ కార్యాలయం మొత్తం ఇందుకు సంబంధించిన కసరత్తు లోనే నిమగ్నమయి ఉంది. ఇక సోమవారం కలెక్టర్, ఎస్పీ భేటీ కూడా ఇదే అంశం ప్రధాన ఎజెండాగా చర్చసాగింది. సవివర నివేదికలతో కలెక్టర్, ఎస్పీ సీఈవో సమీక్షకు హాజర వనున్నారు.

పర్చూరుకు సంబంధించే టెన్షన్...

జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాలన్నీ సమస్య కాకపోయినా పర్చూరు మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా వార్తల్లో ఉండడంతో అందుకు సంబంధించి సీఈవో ఏం అడిగినా జవాబిచ్చేదానికి కావాల్సిన రిపోర్టులన్నీ కలెక్టర్ తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా శాంతి భద్రతలకు సంబంధించి ఎస్పీ రిప్రజెంటేషన్ ఇవ్వాల్సి ఉన్నందున ఆ అంశంపై సమగ్ర నివేదికలతో సిద్ధమై వెళ్లారు.

భోజన విరామం తర్వాత...

బాపట్ల జిల్లాకు సంబంధించి సీఈవోకు ఇచ్చే రిప్రజెంటేషన్ మంగళవారం భోజన విరామం తర్వాత కొనసాగనుంది. బుధవారం కూడా కొనసాగే సమావేశంలో సవరణ ప్రక్రియ , ఎన్నికల సన్నద్ధతపై చర్చించనున్నారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదులతో పాటు వాటిపై తీసుకున్న చర్యలు కూడా ప్రధానంగా చర్చకు రానున్నట్లు తెలుస్తోంది.

పల్నాడులో ప్రక్షాళనపై ఇంకా సందేహాలే..

హలో.. ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారా? అయితే సచివాలయానికి రండి అంటూ బీఎల్‌వోల నుంచి దరఖాస్తు దారులకు ఫోన్ కాల్ వస్తుంది. ధ్రువ పత్రాలతో రావలసిందిగా వారు దరఖాస్తు దారులను ఆదేశిస్తున్నారు. ఫారం -7 విషయంలోనూ ఇదే తంతు. దరఖాస్తుదారులు సదరు పత్రాలతో సచివాలయానికి వెళ్లకుంటే ఆ వ్యక్తికి ఓటు నమోదు కానట్లే. ఇదీ పల్నాడు జిల్లాలో ఓటర్ల దరఖాస్తుల పరిశీలన తీరు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటుకు సంబంధించి అందిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్న నిబంధన ఉంది. దీనిని బీఎల్‌వోలు తుంగలో తొక్కుతున్నారు. జిల్లాలో నకిలీ ఓట్లు 18,035 ఉన్నట్లు రాజకీయ పార్టీలు గుర్తించాయి. ఈ మేరకు వీటిని తొలగించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నేతలు సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. నియోజకవర్గాల వారీగా ఓటరు ఐడెంటీ కార్డు నెంబరు, డోరు నెంబరు కూడా తెలియజేస్తూ వివరాలు అందజేశారు. వీటిని ఈ సారైనా తొలగించేందుకు సదరు అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి. ఒకే ఓటర్లకు రెండు చోట్ల ఓట్లు నమోద య్యాయి. వీటి విషయంలో అనేక మార్లు ఫిర్యాదులు ఇస్తున్నా అధికారులు స్పందించ డంలేదన్న విమర్శలున్నాయి. ఇటువంటి ఓట్లు జిల్లాలో 3,841 ఉన్నట్లు నిర్ధారించారు. వీటిని సరిదిద్దడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జీరో డోర్ నెంబర్‌లపై జిల్లాలో 5,019 ఓట్లు నమోదయ్యాయి. దాదాపు జిల్లా వ్యాప్తంగా మరణించిన 23,100 మందికి ఓట్లు ఉన్నా యని గుర్తించారు. జాబితాలో వీటిని నమోదు చేసి సం బంధిత అధికారులకు తొలగింపు దరఖాస్తులు అంద జేశారు. ఆయా విషయాలను టీడీపీ శ్రేణులు తమ రాష్ట్ర కార్యాలయానికి పంపారు. వీటిపై ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ ఉద్యమంలో వెనకడుగు వేసేది లేదని ఉద్యోగులు తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినా ఏమాత్రం తగ్గేదిలేదని తేల్చి చెబుతున్నారు. చెప్పడమే కాదు.. తొలి రోజు చేసి చూపించారు కూడా! ఎస్మా ప్రయోగంపై అధికారులు ఎన్నిరకాలు ఒత్తిళ్లకు గురిచేసినా ఉద్యోగులు మాత్రం తొలిరోజు విధుల్లో చేరలేదు. దీంతో ఎస్మా హెచ్చరికల ప్రభావం మూడు జిల్లాల్లో ఎక్కడా పని చేయలేదని స్పష్టమవుతోంది.

తగ్గేదే లే

- ఎస్మా ప్రయోగించినా వెనక్కి తగ్గని అంగన్వాడీలు
- తొలిరోజు ప్రభావం చూపని ఎస్మా ఆదేశాలు
- ఒకటి రెండు చోట్ల మినహా అన్ని చోట్లా విధులకు దూరంగానే ఉద్యోగులు
- మిగిలిన అన్నిచోట్లా వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి తప్పని తిప్పలు
- టెంట్లు పీకేస్తామంటూ అధికారుల నుంచి హెచ్చరికలు
- రిలే, ఆమరణ నిరాహార దీక్షల దిశగా సిబ్బంది అడుగులు
- మూడు జిల్లాల్లో 200 కేంద్రాల్లో ఉద్యోగులు

నరసరావుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 5,100 అంగన్వాడీ, మిని అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. కిందటి నెల 12వ తేదీ నుంచి ఉద్యోగులు ఆందోళన చేపట్టడంతో అవి మూతపడ్డాయి. తరువాత వాటి తాళాలు పగలకొట్టి వాటి నిర్వహణ బాధ్యతను వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అప్పగించారు. కానీ అది సత్ఫలితాలను ఇవ్వలేదు. వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా తయారయింది. బాలింతలు, గర్భిణులకు వండి పెట్టడం, పోషణ అందజేయడం నామమాత్రంగా మారిపోయింది. గడిచిన నెల రోజులుగా ప్రీస్కూలు చిన్నారుల హాజరు 20 శాతం కంటే తక్కువగా నమోదవుతోంది. సోమవారం 27 శాతం నమోదయినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. దీంతో ఉద్యోగులను బలవంతంగానైనా ఆందోళన నుంచి విరమింపజేయాలని ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడానికి సిద్ధమైంది. అయినప్పటికీ ఆ ప్రభావం ఏమాత్రం పనిచేయలేదు.

● ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం

తమ సమస్యలపై ఆందోళన చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను చర్చలకు పిలవకుండా పక్కన పెట్టి సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాలను సోమవారం చర్చలకు పిలవడం ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహానికి దారి తీసింది. తమకు సంఘీభావం ప్రకటించిన సంఘాలను బెదిరించి, సంఘీభావం లేకుండా చేయాలన్న కుట్రతోనే ప్రభుత్వం, అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఉద్యోగుల నిరసన శిబిరాలను తొలగిస్తామని అధికారులు హెచ్చరికలు పంపినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. అదేగనుక జరిగితే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు. ఎస్మా ప్రయోగంపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. తమ విధులు అత్యవసర సేవల పరిధిలోకి రావని, కోర్టులోనే ఇది తేల్చుకుంటామని చెబుతున్నారు. ఎస్మా ప్రయోగాన్ని నిరసిస్తూ నిరాహార దీక్షలకు సంసిద్ధమవుతున్నారు. ప్రభుత్వం గనుక నిరసన శిబిరాలను తొలగిస్తే అక్కడే రిలే నిరాహార దీక్షలు చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే ఆమరణ నిరాహార దీక్షలు చేయక తప్పదని హెచ్చరిస్తున్నారు.

● నిరాహార దీక్షలు చేపడతాం: దీప్తి , జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం ఉద్యోగులను బలవంతంగా లొంగదీసుకోవాలని చూస్తోంది. మరో వైపు ఆందోళనా శిబిరాలను పీకేయాలని చూస్తోంది. ఎస్మా ప్రయోగించి ఉద్యోగుల జీవితాలతో ఆడుకోవాలనుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ప్రభుత్వం ఇలానే బెదిరింపులకు దిగితే ఉద్యమం మరింత ఉధృతమవుతుంది. ప్రభుత్వం మా టెంట్లు బలవంతంగా పీకేయాలని చూస్తోంది. అదే జరిగితే అక్కడే నిరాహార దీక్షలకు దిగుతాం.


నరసరావుపేటలో అంగన్‌వాడీల నిరాహార దీక్ష

● ఉద్యమాన్ని నీరుగార్చే కుట్రలు తగవు: టీ రాధ, గుంటూరు నగర కార్యదర్శి

అంగన్వాడీ ఉద్యోగులకు సరైన పరిష్కారం చూపాలి. కనీసం సరైన రీతిలో చర్చలు కూడా జరపకుండా ప్రభుత్వం నిర్బంధ పద్ధతులు అవలంభిస్తోంది. నిర్బంధం వల్ల ఉద్యమం మరింత ఉధృత మవుతుంది. ఎస్మా పేరు చె ప్పి బెదిరిస్తే బెదిరేది లేదు. ఉద్యోగులు ఉద్యమం నుంచి విధుల్లోకి వస్తున్నారని తప్పుడు లెక్కలు చూపడం సిగ్గుచేటు.

మూడు జిల్లాల్లో 5వేలకు పైగా అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, సోమవారం 200 మంది వరకూ విధులకు హాజరయినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. గుంటూరు నగరంలోనే ఎక్కువమంది విధులకు హాజరయ్యారు. కాగా గ్రామీణ ప్రాంత ఉద్యోగులు మాత్రం పట్టుదలగా ఉన్నారు. అధికారిక లెక్కల ప్రకారం గుంటూరు సీడీపీవోలో 127, మంగళగిరిలో 50, పిరంగిపురంలో 5, పొన్నూరులో 13, ప్రత్తిపాడులో 46, తెనాలిలో ఒక అంగన్వాడీ కేంద్రం తెరిచినట్లు అధికారులు చెబుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం చూసుకున్నా గుంటూరు జిల్లాలోని 1482 అంగన్వాడీ కేంద్రాల్లో 240మంది మాత్రమే విధులకు హాజరయ్యారు. అయితే ఈ గణాంకాలు తప్పని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఉద్యమాన్ని నీరుగార్చడానికి అధికారులు ఇలాంటి తప్పుడు లెక్కలు చూపుతున్నారని ఉద్యోగులు అంటున్నారు. ఆందోళన విరమించి విధుల్లో చేరుతున్నారన్న ప్రచారం కల్పించడానికే ఐసీడీఎస్ అధికారులు ఇలా తప్పుడు లెక్కలు చూపుతున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.


అమరావతిలో ఎస్మా జీవో కాపీలను బోగిమంటలో వేసి దగ్ధం చేస్తూ..


సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలోనే అంగన్‌వాడీలు నిద్ర

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

విజయపురిసౌత్, జనవరి 8: నాగార్జున సాగర్ కుడి కాలువకు సోమవారం నీటి విడుదల చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డు అజయ్‌కుమార్‌గుప్త పర్యవేక్షణలో 5, 7 గేట్ల ద్వారా 2500 క్యూసెక్కుల చొప్పున 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ముందుగా ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ మురళీధరరెడ్డి, అజయ్‌కుమార్‌గుప్తాలు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా మురళీధరరెడ్డి మాట్లాడుతూ తాగునీటి అవసరాల నిమిత్తం 5 వేల క్యూసెక్కుల చొప్పున 11 రోజులపాటు మొత్తంగా 5 టీఎంసీల నీటిని వినియోగించుకోనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణానది యాజమాన్య బోర్డు ఈఈలు రఘునందన్‌రావు, శివశంకర్, లింగంగుంట సర్కిల్ ఎస్ఈ వరలక్ష్మి, ప్రాజెక్ట్ ఈఈ శ్రీహరి, డీఈలు మురళీధర్, వెంకటసుబ్బయ్య, జేఈలు బాబు మియా, భారతి తదితరులు పాల్గొన్నారు.


కుడికాలువ ద్వారా విడుదలవుతున్న నీరు

నరసరావుపేట వైసీపీ అభ్యర్థి .. డాక్టర్ గోపిరెడ్డి

ప్రకటించిన విజయసాయి రెడ్డి

- గోపిరెడ్డితో కలసి పనిచేయాలని నేతలకు సూచన
- కంగుతిన్న గోపిరెడ్డి వ్యతిరేక వర్గం
- కలసి పనిచేయమంటూ తెగేసి చెప్పిన వైనం
- తాడేపల్లిలో పార్టీ కార్యాలయంలో నేతల పంచాయితీ



నరసరావుపేట, జనవరి 8 : నరసరావుపేట అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా మళ్లీ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని అధిష్ఠానం నిర్ణయించిందని రాజ్యసభ సభ్యుడు, జిల్లా కో ఆర్డినేటర్ విజయసాయి రెడ్డి వెల్లడించారు. కొంత కాలంగా ఆయన అభ్యర్థిత్వంపై జరుగుతున్న ప్రచారానికి సాయిరెడ్డి తెరదింపారు. ఈ మేరకు గోపిరెడ్డిని వ్యతిరేకిస్తున్న నేతలను అధిష్ఠానం బుజ్జగిస్తోంది. ఈనేపథ్యంలో తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో గోపిరెడ్డి, అయన వ్యతిరేక వర్గం నేతలతో సోమవారం సాయిరెడ్డి సమావేశం నిర్వహించారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి గోపిరెడ్డికి టిక్కెట్ ఇవ్వాలని నిర్ణయిం తీసుకున్నారని, దీనికి కట్టుబడి పార్టీ శ్రేణులు పనిచేయాల్సిందేనని ఆయన తేల్చి చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అందరూ కలసి పనిచేయాలని, శ్రీనివాసరెడ్డి విజయానికి కృషి చేయాలని సాయిరెడ్డి వ్యతిరేక వర్గానికి సూచించారు. అధిష్ఠానం నిర్ణయం ఆయన వ్యతిరేక వర్గాన్ని కంగు తినిపించింది. గోపిరెడ్డికి పార్టీ టిక్కెట్ ఇస్తే ఆయనతో కలసి పనిచేసేది లేదని వ్యతిరేక వర్గం నేతలు సాయిరెడ్డి వద్ద తేల్చి చెప్పారు. గోపిరెడ్డికి వ్యతిరేకంగా కొంత కాలంగా ఒక బలమైన వర్గం నియోజకవర్గంలో పని చేస్తోంది. ఈ వర్గానికి పార్టీ సీనియర్ నేత డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి నేతృత్వం వహిస్తున్నారు. గోపిరెడ్డికి టిక్కెట్ ఇవ్వొందంటూ ఇటీవల తాడేపల్లి సీఎంవో వద్ద ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నియోజకవర్గంలో పలు కార్యక్రమాలను కూడా నిర్వహించారు. గోపిరెడ్డిపై అనేక ఫిర్యాదులను అధిష్ఠానానికి చేశారు. అయితే అయన వ్యతిరేక వర్గం వాదనను అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోలేదు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డితో సాయిరెడ్డి నిర్వహించిన సమావేశంలో డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, డాక్టర్ సుధీర్ భార్గవ రెడ్డి, రొంపిచర్ల జడ్‌పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, హనీఫ్‌లు పాల్గొన్నారు. మొత్తం మీద కొంత కాలంగా నెలకొన్న పార్టీ అభ్యర్థిత్వంపై అధిష్ఠానం ఈ సమావేశం ద్వారా స్పష్టత ఇచ్చింది. ఇక గోపిరెడ్డి వ్యతిరేక వర్గం ఎన్నికల్లో అయనకు ఏమేరకు సహకరిస్తారో చూడాలి. గోపిరెడ్డితో కలసి పనిచేసేది లేదని సాయిరెడ్డి వద్ద స్పష్టం చేసినట్టు పార్టీ నేతలు తెలిపారు.

హర్షం వ్యక్తం చేసిన గోపిరెడ్డి

వచ్చే ఎన్నికల్లో తననే నరసరావుపేట అభ్యర్థిగా నియమిస్తూ అధిష్ఠానం నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని గోపిరెడ్డి తెలిపారు. అసంతృప్తిగా ఉన్న నేతలతో విజయసాయి రెడ్డి మాట్లాడి ఏకాభిప్రాయం తీసుకురావడం జరిగిందన్నారు. ఎన్నికల్లో విజయానికి ప్రణాళిక రూపొందించుకుంటామన్నారు. కొందరు అసంతృప్తిగా ఉన్న మాట వాస్తవమేనని, వారందరిని కలుపుకొని పోయే కార్యక్రమం చేస్తానన్నారు. వారిపై కేసులు అనేది అసత్యం అన్నారు.

గ్రామీణ క్రీడకు ప్రోత్సాహం అభినందనీయం

- సత్తెనపల్లిలో కోలాహలంగా కబడ్డీ పోటీలు
- ప్రారంభించిన ధూళిపాళ్ళ నరేంద్ర


కబడ్డీ పోటీలను ప్రారంభించిన కన్నా లక్ష్మీనారాయణ, నరేంద్ర

సత్తెనపల్లి, జనవరి 8 : గ్రామీణ క్రీడైన కబడ్డీని కన్నా లక్ష్మీనారాయణ ప్రోత్సహించటం అభినందనీయమని పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. సత్తెనపల్లిలోని విద్యా కేంద్రం కళాశాల ఆవరణలో కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సోమవారం నియోజక వర్గ స్థాయి పురుషుల కబడ్డీ పోటీలను కన్నాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు నిర్వాహకులు దరువూరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక యువత నిర్వీర్యం అవుతోందన్నారు. గంజాయి విక్రయాలు విచ్చలవిడి అయ్యాయన్నారు. ఉద్యోగాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉందన్నారు. రాష్ట్రంలో మార్పును తీసుకు రావాల్సిన బాధ్యత యువత పై ఉందన్నారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, నియోజకవర్గ స్థాయిలో యువతను ప్రోత్సహించేందుకే కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సత్తెనపల్లిలో వైసీపీ నేతలు సంక్రాంతి సంబరాల పేరిట లాటరీ టిక్కెట్లు విక్రయియిస్తూ పెన్షన్‌దారులను కూడా దోచుకుంటున్నారన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జాతీయ క్రీడ అయినటువంటి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. గెలుపు, ఓటములను యువత సమానంగా స్వీకరించాలన్నారు. అనంతరం నరేంద్ర కుమార్, కన్నా లక్ష్మీనారాయణలు కబడ్డీ ఆడి పోటీలు ప్రారంభించారు. మొత్తం 47 టీమ్‌లు పోటీలకు హాజరయ్యాయి. కార్యక్రమంలో జనసేన నియోజక వర్గ నేత బొర్రా వెంకట అప్పారావు, టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, నాగోతు శౌరయ్య, కటకం రామకృష్ణ, ఆతుకూరి నాగేశ్వరరావు, గోగినేని కోటేశ్వరరావు, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, తాత జయప్రకాష్ నారాయణ, పీఈటీలు దాసరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా కబడ్డీ పోటీలు ఎంతో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. పట్టణ ప్రజలు ఆసక్తిగా పోటీలను తిలకిస్తున్నారు.


కబడ్డీ ఆడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

దిక్సూచి
DIKSUCHI

ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రత్యేకం
ఇండియన్ సొసైటీ

బంధుత్వం ఒక సామాజిక సంస్థ



బంధుత్వం(కిన్‌షిప్)

సంస్థ అంటే ఒక క్రమపూర్వకమైన సామాజిక సంబంధాల వ్యవస్థ. సామాజిక ప్రమాణాలు, విలువలపై ఆధారపడిన అవ్యవస్థీకృతమైన సమూహమే సామాజిక సంస్థ. ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి ఒక తరం నుంచి మరో తరం వరకు జాగ్రత్తగా కొనసాగే ప్రామాణిక వ్యవస్థే సామాజిక సంస్థ. ప్రతి సమాజంలోనూ ప్రాథమికంగా ఉండేవి బంధుత్వం, వివాహం, కుటుంబం, మతం, విద్య, ఆర్థిక, రాజకీయ సంస్థలు.

బంధుత్వం: సమాజంలో మానవుడు ఒంటరిగా జీవించలేడు. జన్మించింది మొదలుకొని మరణించే వరకు వ్యక్తి అనేక మందితో సంబంధాన్ని కలిగి ఉంటాడు. సమాజంలో ఉన్న వ్యక్తుల మధ్య ఏదో ఒక రకమైన సంబంధం కొనసాగుతూ ఉంటుంది. అయితే రక్తం లేదా వివాహం ఆధారంగా ఏర్పడే బంధాలు దగ్గరగా ఉంటాయి.

రక్త బంధుత్వం: భార్య, భర్త ఇద్దరికీ, వారి సంతానానికి మధ్య ఏర్పడిన పరస్పర బంధాలను 'రక్త బంధుత్వం' అని పిలుస్తారు. ఒకే దంపతులకు పుట్టిన బిడ్డలందరి మధ్య రక్త సంబంధం ఉంటుంది. ఈ సంబంధాన్ని తెలిపేదే 'ఏక రక్త సంబంధం'.

బంధుత్వాలను భిన్న సమాజాలలో భిన్న రీతులుగా అనుసరిస్తున్నారు. ఉదాహరణకు తమిళనాడులోని నీలగిరి కొండల్లో నివశిస్తున్న 'తోడా' సమాజంలో స్త్రీ ఒక వ్యక్తితో సంతానం కలిగి...తదనంతరం మరో వ్యక్తిని వివాహం చేసుకుంటే అతడినే ఆ స్త్రీ పూర్వ సంతానికి కూడా తండ్రిగా అక్కడి సమాజం గుర్తిస్తుంది. ఈ తరహా బంధుత్వాన్ని సామాజిక బంధుత్వం(సోషియాలజికల్ కిన్‌షిప్) అంటారు. సామాజిక బంధుత్వాన్ని మాత్రమే 'వాస్తవ బంధుత్వం' అంటారు. ఇటువంటి వాస్తవ బంధుత్వాన్ని బట్టి కూడిన వారిని బంధువులు(కిన్స్) అంటారు.

ద్వితీయ బంధువులు: ఒక వ్యక్తికి సంబంధించిన ప్రాథమిక బంధువులకు చెందిన ప్రాథమిక బంధువులు, ఆ వ్యక్తికి ద్వితీయ బంధువులు అవుతారు.(భార్య ప్రాథమిక బంధువు, ఆవిడ తల్లిదండ్రులు-సోదర, సోదరీమణులు ద్వితీయ బంధువులు)

తృతీయ బంధువులు: ఒక వ్యక్తి ద్వితీయ బంధువులకు చెందిన ప్రాథమిక బంధువులు... ఆ వ్యక్తికి తృతీయ బంధువులు అవుతారు.

ఉదా:- భార్య తాలూకు బావ(తోడల్లుడు తృతీయ బంధువు అవుతాడు. మొదటి వ్యక్తి తాలూకు భార్య ప్రాథమిక బంధువు, ఆవిడ అక్క ద్వితీయ బంధువు, అక్క భర్త తృతీయ బంధువు)

వర్గాత్మక వ్యవస్థ: వర్గాత్మక వ్యవస్థలో వివిధ సంబంధీకులు అందరినీ ఒకే వర్గంలో చేర్చడంతోపాటు ఒకే పదంతో వారిని సంబోధిస్తారు. ఉదా:- మామ ఒక వర్గాత్మక పదం.

వర్గాత్మక వ్యవస్థలో బంధువులను సంబోధించే పద్ధతులను బట్టి బంధుత్వ పదాలను మూడు రకాలుగా పేర్కొనవచ్చు. అవి.. పదాలు, అన్వయ పదాలు, టెక్నానమీ.

ఎ) సంబోధన పదాలు: ఒక వ్యక్తి తన బంధువులతో సంభాషించేటప్పుడు వాడే పదాలు 'సంబోధన' పదాలు.

ఉదాహరణలు:-

1. ఒక వ్యక్తి తన చెల్లెలితో సంభాషించేటప్పుడు 'సోదరి' అని వాడుతారు.
2. ఒక వ్యక్తి తన తండ్రితో సంభాషించేటప్పుడు 'నాన్న' అని వాడతారు.

బి) అన్వయ పదాలు: ఒక వ్యక్తి మూడో వ్యక్తితో ఒకానొక తన బంధువు గురించి చెప్పేటప్పుడు ఉపయోగించే బంధుత్వ పదమే 'అన్వయ పదం'. ఉదాహరణకు ఒక వ్యక్తి తన నాన్న సోదరుని గురించి మూడో వ్యక్తికి చెప్పినప్పుడు మా 'చిన్నాన్న' అని వర్ణిస్తాడు. అంటే 'చిన్నాన్న' అన్వయ పదం.

వివరణాత్మక పదాలు: రెండు లేదా అంతకన్నా ఎక్కువ ప్రాథమిక పదాలు కలిసినందు వల్ల ఒక కొత్త పదం ఏర్పడినప్పుడు దానిని వివరణాత్మక పదం అంటారు. ఉదాహరణకు నాన్న+అమ్మ=నాన్నమ్మ.

బంధుత్వం ఆచరణలు(కిన్‌షిప్ యూసేజెస్): బంధు సమూహాలలో వ్యక్తుల మధ్య వివిధ రకాలైన బంధుత్వాలు ఉంటాయి. ఒక్కో రకమైన బంధుత్వం ఒక్కో రకమైన ప్రవర్తనను తెలియజేస్తుంది. సమాజం మొత్తమ్మీద చూస్తే... బంధు సమూహాలలోని వ్యక్తుల మధ్య కొన్ని నిర్దిష్టమైన ప్రవర్తనలు కనిపిస్తాయి. వాటినే బంధుత్వ ఆచరణలు అంటారు. వాటిలో ఆరు ప్రధానమైనవి. అవి... పరిహాస సంబంధాలు, వైదొలుగు నడవడి, మాతులాధికారం, పితృష్వాదికారం, సాంకేతిక సంబోధన, కుహనా ప్రసూతి.



జి.వీరా స్వామి,
సీనియర్ ఫ్యాకల్టీ.

జాబ్ కార్నర్

టీహెచ్‌డీసీలో అప్రెంటిస్‌లు

రిషికేశ్ (ఉత్తరాఖండ్)లోని టీహెచ్‌డీసీ ఇండియా లిమిటెడ్... అప్రెంటిస్‌షిప్‌లో శిక్షణకు స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు 80

పోస్టు: ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్

ట్రేడులు: కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్/సెక్రటేరియల్ అసిస్టెంట్, డ్రాఫ్ట్స్‌మ్యాన్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్.

అర్హత: 10వ తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 24

వెబ్‌సైట్: https://thdc.co.in/


మద్రాస్ ఐఐటి, డేకిన్ వర్సిటీ ఉమ్మడిగా

రీసెర్చ్ అకాడమీ

మద్రాస్ ఐఐటీ, ఆస్ట్రేలియాకు చెందిన డేకిన్ యూనివర్సిటీ కలిసి ఉమ్మడిగా రీసెర్చ్ అకాడమీని ఆరంభించాయి. 'ఐఐటీ మద్రాస్ డేకిన్ యూనివర్సిటీ రీసెర్చ్ అకాడమీ'గా మలిచారు. ఉమ్మడి పర్యవేక్షణ, మెరిటోరియస్ స్కాలర్‌షిప్స్‌తో గ్లోబల్ రీసెర్చ్‌కు శ్రీకారం చుట్టారు. సార్క్ అలాగే ఆసియన్ దేశాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్లు - ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించే దిశగా పరిశోధనలు చేస్తారని మద్రాస్ ఐఐటీ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. క్లీన్ ఎనర్జీ, క్రిటికల్ టెక్నాలజీస్, క్లయిమేట్ చేంజ్, హెల్త్‌కేర్ టెక్నాలజీస్ తదితరాలకు ప్రాధాన్యం ఇస్తారు. రెండు విశిష్ట సంస్థలు ఉమ్మడిగా నాలుగేళ్ళ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తాయి. ఇందులో భాగంగా ముప్పయ్ స్కాలర్‌షిప్‌లను అందిస్తారు. తమ పరిశోధకులకు ఇచ్చేందుకు డేకిన్ వర్సిటీ పది, ఐఐటీ మద్రాస్ ఇరవై స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేశాయి.

వెబ్‌సైట్స్: https:// www.iitm.ac.in/ www.deakin.edu.au/

సైన్స్‌లో పీహెచ్‌డీకి జెస్ట్



సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రవేశాలకు ఉద్దేశించిన జాయింట్ ఎంట్రెన్స్ స్క్రీనింగ్ టెస్ట్(జెస్ట్) 2024 నోటిఫికేషన్ వెలువడింది. తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ) దీనిని నిర్వహిస్తోంది. ఈ స్కోర్ వ్యాలిడిటీ ఏడాది. ఇందులో ఏఆర్ఐఈఎస్, బోస్ ఇన్‌స్టిట్యూట్, హెచ్‌బీఎన్ఐ, హెచ్ఆర్ఐ, ఐసీటీఎస్, ఐజీసీఏఆర్, ఐఐఏ, ఐఐఎస్సీ, ఐసర్ సంస్థలు, ఐఐఎస్‌టీ, ఐఎంఎస్సీ, ఐఓపీ, ఐపీఆర్, ఐయూసీఏఏ, జేఎన్‌సీఏఎస్ఆర్, ఎన్‌బీఆర్‌సీ, నైసర్, ఎన్‌సీఆర్ఏ - టీఐఎఫ్ఆర్, పీఆర్ఎల్, ఆర్ఆర్‌సీఏటీ, ఆర్ఆర్ఐ, ఎస్ఐఎన్‌పీ, ఎస్ఎన్‌బీఎన్‌సీబీఎస్, టీఐఎఫ్ఆర్-టీసీఐఎస్, టీఐఎఫ్ఆర్, యూజీసీ-డీఏఈ సీఎస్ఆర్, వీఈసీసీ వంటి ప్రధాన సంస్థలు పాల్గొంటున్నాయి. జెస్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా ఈ సంస్థల్లో ప్రవేశాలు కల్పిస్తారు. వీటిలో కొన్ని సంస్థలు అందిస్తున్న ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు. ప్రతి సంస్థకూ నిర్దేశిత అర్హత నిబంధనలు ఉన్నాయి. వాటి వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లలో చూడవచ్చు.

స్పెషలైజేషన్‌లు: ఫిజిక్స్, థియరిటికల్ కంప్యూటర్ సైన్స్, న్యూరోసైన్స్, కంప్యూటేషనల్ బయాలజీ.

అర్హత: పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/ఆప్టిక్స్ అండ్ ఫొటోనిక్స్/ఆస్ట్రానమీ/ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/బయోఫిజిక్స్/బయోకెమిస్ట్రీ/ కెమిస్ట్రీ/కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; ఎంసీఏ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/ఎంటెక్-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/రేడియో ఫిజిక్స్/మేథమెటిక్స్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఆప్టిక్స్ అండ్ ఫొటోనిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఎస్సీ/పోస్ట్ బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్/బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు, ఎంసీఏ అభ్యర్థులకు కూడా కొన్ని సంస్థలు అవకాశం కల్పిస్తున్నాయి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న అభ్యర్థులూ అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఆసక్తిగలవారు ఎన్నిసార్లయినా ఈ పరీక్ష రాయవచ్చు.

జెస్ట్ 2024 వివరాలు: ఈ పరీక్షని ఫిజిక్స్, థియరిటికల్ కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒక విభాగంలో మాత్రమే పరీక్ష రాయాలి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం 3 గంటలు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో 15 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి మూడు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో 10 ప్రశ్నలు ఇస్తారు. ఆప్షన్స్ ఇవ్వరు. వీటికి ఒక నెంబరు సమాధానంగా ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. ఈ ప్రశ్నలకు రుణాత్మక మార్కులు లేవు. మూడో పార్ట్‌లో 25 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానం తప్పుగా గుర్తిస్తే మూడోవంతు మార్కు కోత విధిస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద బ్లాక్/బ్లూ పెన్‌తో గుర్తించాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 24
- **జెస్ట్ 2024 తేదీ:** మార్చి 3
- **వెబ్‌సైట్:** jest.org.in

హైదరాబాద్ నిక్మర్‌లో పీజీ ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్(నిక్మర్)-పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి ఫుల్ టైం ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్‌లు. ఏడాది, రెండేళ్ల వ్యవధి గల ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఏడాదికి రెండు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ (పీజీ ఎన్‌క్యాట్) 2024, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, రేట్ ఆఫ్ అప్లికేషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. నిర్దేశిత డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి ప్రోగ్రామ్‌లో పది శాతం అభ్యర్థులకు నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ అడ్వాన్స్‌డ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. కనీసం 50 శాతం మార్కులతో ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ హెల్త్, సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ద్వితీయ శ్రేణి మార్కులతో రెగ్యులర్ డిగ్రీ(ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/మేనేజ్‌మెంట్/ఎకనామిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/అగ్రికల్చర్) పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ(ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/కామర్స్/ఫైనాన్స్/బ్యాంకింగ్/ మేనేజ్‌మెంట్/ఎకనామిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

పీజీ ఎన్‌క్యాట్ 2024: పరీక్షని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. దీనికి 180 మార్కులు నిర్దేశించారు. ఇందులో క్వాంటిటేటివ్ అండ్ అనలిటికల్ ఎబిలిటీ నుంచి 72 మార్కులకు, డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 36 మార్కులకు, వెర్బల్ అండ్ జనరల్ ఎబిలిటీ నుంచి 72 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

- గ్రూప్ డిస్కషన్‌కు 20 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 మార్కులు, రేటింగ్ ఆఫ్ అప్లికేషన్‌కు 70 మార్కులు ప్రత్యేకించారు.
- సీయూఈటీ(పీజీ)/క్యాట్/మ్యాట్/ఎక్స్ఏటీ/ఎన్‌మ్యాట్/ఏటీఎంఏ స్కోర్ ఉన్నవారు పీజీ ఎన్‌క్యాట్ 2024 రాయనవసరం లేదు.
- పీజీ ఎన్‌క్యాట్ 2024 స్కోర్‌కు 60 శాతం; గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల స్కోర్లకు 16.67 శాతం; రేటింగ్ ఆఫ్ అప్లికేషన్‌కు 23.33 శాతం వెయిటేజీ ఇస్తారు.

★ **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31

★ **వెబ్‌సైట్:** nicmar.ac.in/hyderabad

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/KLKVIU1లో చదవండి.




నవ్య | చిత్రజ్యోతి

తాట తీస్తా..



'నేను కష్టపడి ఈ స్థాయికి వచ్చాననేమో.. ప్రతి ఏడాది సంక్రాంతి వస్తే చాలు.. ఏదో ఒక వివాదాన్ని లేవనెత్తుతూ నాపై ట్రోల్స్ చేయడం కొన్ని వెబ్‌సైట్స్‌కి పరిపాటైపోయింది. ఏడెనిమిదేళ్ల నుంచి ఇదే తంతు. నిన్నటి 'హను-మాన్' ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో చిరంజీగారు ఈ థియేటర్ల వ్యవహారంపై ఎంతో పాజిటీవ్‌గా మాట్లాడారు. 'సమస్యను ఎలా పరిష్కరించాలో దిల్‌రాజుకి తెలుసు.. ఈ విషయాల్లో తనకు అనుభవం ఉంది' అంటూ నా గురించి కూడా గౌరవంగా స్పందించారు. ఆ మాటల్ని వేరే విధంగా మార్చి రెండు ప్రముఖ వెబ్‌సైట్లు పిచ్చి రాతాలు రాశాయ్. మీ వెబ్‌సైట్ రేటింగ్ పెంచుకోవటానికి వేరే వాళ్లను ఎందుకు బలి చేస్తున్నారు? అంటే దిల్ రాజు ఏం రియాక్టవ్వడు, సర్దుకుని పోతాడు అనుకుంటున్నారా? తాట తీస్తా..' అంటూ ప్రముఖ నిర్మాత దిల్ రాజు హెచ్చరిక జారీ చేశారు. తన గురించి అవాస్తవాలు రాశారంటూ.. రెండు వెబ్‌సైట్లపై(ఆంధ్రజ్యోతి కాదు) దిల్‌రాజు ఘాటైన వ్యాఖ్యలు చేశారు. వెన్నెల కిశోర్, అనన్య నాగళ్ల జంటగా రూపొందుతోన్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్స్'. రచయిత గోపీ మోహన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వి.రమణారెడ్డి నిర్మాత. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని సోమవారం హైదరాబాద్‌లో దిల్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిల్ రాజు మాట్లాడారు. 'చాలా రోజులుగా ఓపిక పడుతూ వచ్చాను. నా వల్ల ఇబ్బంది పడుతున్నట్టు ఏ ప్రొడ్యూసరైనా మీకు చెప్పాడా? దమ్ముంటే ఆ ప్రొడ్యూసర్‌నీ నన్నూ ఒక వేదికపై కూర్చోబెట్టి ప్రశ్నించండి. వ్యాపారపరంగా వచ్చే సమస్యల్ని అడ్వాంటేజ్‌గా తీసుకొని నన్ను బ్లేమ్ చేయడానికి వెబ్‌సైట్లనీ, యూట్యూబ్ ఛానల్స్‌ని కొందరు వాడుకుంటున్నారు. సంక్రాంతి రిలీజ్‌ల గురించి ఛాంబర్‌లో మీటింగ్ పెట్టాం. థియేటర్ల కొరత రాకూడదని నిర్మాతను రిక్వెస్ట్ చేసి రవితేజగారి సినిమాను సంక్రాంతి నుంచి పక్కకు జరిపాం. ఇది ఎంత కష్టమైన పనో తెలుసా?.. ఇంకోడెవడో రాశాడు. 'దిల్ రాజు తమిళ సినిమాను సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నాడు' అని. ఎవడు చెప్పాడ్రా.. నేను రిలీజ్ చేస్తున్నానని? నీ దగ్గర రుజువు ఉందా? ఆ తమిళ సినిమా రిలీజ్‌ను వాయిదా వేయించిందే నేను. విషయం తెలియకుండా అబద్ధాలు ఎందుకు రాస్తారు? మళ్లీ చెబుతున్నా.. తేలిగ్గా తీసుకోకండి.. ఇక నుంచి నా గురించి అబద్ధాలు రాసి, కాంట్రవర్సీలు క్రియేట్ చేస్తే ఊరుకోను., తాటతీస్తా..' అంటూ ఉద్వేగంగా స్పందించారు దిల్‌రాజు.


'నా సామిరంగ' మరో 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' అవుతుంది



కీరవాణి

'నాగార్జునకు సరిగ్గా సరిపోయే టైటిల్ 'నా సామిరంగ'. 32ఏళ్ల క్రితం నాగార్జునతో నేను చేసిన 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' ఎంతటి విజయాన్ని సాధించిందో.. సంక్రాంతికి రానున్న 'నా సామిరంగ' కూడా అంతటి విజయాన్ని సాధిస్తుందని నా నమ్మకం. 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' పల్లెటూరి నేపథ్యంతో కూడిన వినోదాత్మక చిత్రం. 'నా సామిరంగ' కూడా సేమ్ టు సేమ్. కాబట్టి ఇది మరో 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' అవుతుందని ఆశిస్తున్నా.' అని ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి అన్నారు. అక్కినేని నాగార్జున హీరోగా విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మించిన చిత్రం 'నా సామిరంగ'. కీరవాణి స్వరాలందించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా కీరవాణి విలేకరులతో మాట్లాడారు. ' రీరికార్డింగ్ సమయంలో ఓ సందర్భం పాట రాయాలనే ఆలోచనకు దోహదం చేసింది. దాంతో ఇందులో ఓ పాట రాశాను. ఈ సినిమాలో సంగీతం స్వచ్ఛంగా ఉంటుంది. క్వాలిటీ తగ్గకుండా వేగంగా సినిమా తీయగలగడం దర్శకుడు విజయ్ బిన్నీ ప్రత్యేకత. అతను స్వతహాగా డాన్స్ మాస్టర్. కాబట్టి డాన్స్‌ను దృష్టిలో పెట్టుకొని ట్యూన్స్ తీసుకుంటాడనుకున్నాను. కానీ అద్భుతమైన మూడు మెలొడీస్‌ని నా నుంచి తీసుకున్నాడు. దర్శకుడిగా అతనిలోని పరిపక్వత నాకప్పుడు అర్థమైంది' అని కీరవాణి అన్నారు. ఇటీవలి సినిమాల్లో జైలర్, యానిమల్ చిత్రాల సంగీతం బావుందని ఆయన చెప్పారు. 'హరిహరవీరమల్లు' సినిమాకు సంబంధించిన మూడు పాటల రీకార్డింగ్ పూర్తయిందని, అలాగే, చిరంజీవి 'విశ్వంభర' మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా మొదలయ్యాయని అన్నారు. రాజమౌళి సినిమాకు సంబంధించిన మ్యూజిక్ పనులు ఇంకా మొదలవ్వలేదని కీరవాణి తెలిపారు.

కత్తులూ, నెత్తురే ఎక్కువ చూసి ఉండాది



'ఈ సముద్రం చేపలకంటే కత్తులూ, నెత్తురే ఎక్కువ చూసి ఉండాది. అందుకే దీన్ని ఎర్రసముద్రం అంటారు' అంటున్నారు ఎన్టీఆర్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 'దేవర' చిత్రంలోనిదీ డైలాగ్. కొరటాల శివ దర్శకుడు. సోమవారం చిత్రబృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. రోమాంచిత పోరాట ఘట్టాలు, పతాక స్థాయి భావోద్వేగాలతో గ్లింప్స్ ఆద్యంతం అలరించింది. ఆగ్రహం నిండిన కళ్లతో ఎన్టీఆర్ పవర్‌ఫుల్‌గా కనిపించారు. సముద్రపు దొంగలు నౌకలను దోచుకోవడం, వారిని ఎన్టీఆర్ ఊచకోత కోసే సన్నివేశాలతో యాక్షన్ హంగామా కనిపించింది. అనిరుధ్ రవిచంద్రన్ ఇచ్చిన నేపథ్య సంగీతం ఆకట్టుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ 5న 'దేవర' చిత్రం తొలిభాగం విడుదలవుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, మురళీశర్మ కీలకపాత్రల్లో నటిస్తున్నారు.

దర్శకుడు కే జయదేవ్ కన్నుమూత



సీనియర్ జర్నలిస్ట్, సినీ దర్శకుడు కే జయదేవ్ కన్నుమూశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య యశోద, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జయదేవ్ దర్శకత్వం వహించిన 'కోరంగి నుంచి' చిత్రం పలు జాతీయ, అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. భారతరత్న సీఎన్ఆర్ రావుపై ఫిల్మ్స్ డివిజన్‌కు ఆయన డాక్యుమెంటరీ నిర్మించారు. ప్రముఖ దర్శకుడు, జర్నలిస్ట్ కెఎన్‌టి శాస్త్రికి జయదేవ్ చిన్న కుమారుడు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/WwIRX55 లో చదవండి.

వైసీపీకి ఓటమి భయం

● రాష్ట్రంలో సంక్షేమం పేరుతో దోపిడీ

● మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు

తెనాలి రూరల్, జనవరి 8: నీరో చక్రవర్తిగా మారిన జగన్ పాలను గద్దెదించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనంద్‌బాబు ఆరోపించారు. సోమవారం తెనాలిలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తలపెట్టిన ప్రజాయాత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆనందబాబు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని జగన్ అప్పుల పాలు చేస్తూ ప్రజలకు సంక్షేమం అంటూ సంక్షోభ పాలనకు తెరలేపారని విమర్శించారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేసి అన్నగా మహిళలకు అండగా నిలుస్తానని చెప్పిన జగన్ మద్యం షాపులు పెంచి ఏరులై పారిస్తున్నారని ఆక్షేపించారు. చరిత్రలో పేదవాడి సంక్షేమం పేరుతో ఇంత పెద్దమొత్తంలో దోచుకోవచ్చని ఈ ప్రభుత్వం నిరూపించిందని విమర్శించారు. చంద్రబాబు అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు నడిపారని, చంద్రబాబు సీఎంగా తాను మంత్రిగా 5600కిలోమీటర్ల మేర గ్రామాల్లో పట్టణాల్లో రోడ్లువేసి అభివృద్ధి చేశామని చెప్పారు. జగన్ పాలనలో ఒక్క కిలోమీటరైనా రోడ్డు వేయగలిగారా అని ప్రశ్నించారు. దళితులకు అందించాల్సిన నిధులను కూడా పక్కదోవ పట్టించిన జగన్ ప్రభుత్వం నా ఎస్సీలు, నాఎస్టీలూ అంటూ దీర్ఘంతీస్తూ లేని ప్రేమను వలకబోయడం తప్ప ఇంకేం చేయగలరని ఎద్దేవా చేశారు. ప్రజలను వంచించిన వైసీపీకి రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. జగన్‌కు, వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులకు ఓటమి భయం పట్టుకుందన్నారు. న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని ఉద్యోగులు నిరసన చేస్తుంటే చర్చలకు రమ్మని కబురుపెట్టే సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారాయణలు వారితో ఏం మాట్లాడతారో అర్థమయ్యే పరిస్థితి కూడా లేదన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబును గెలిపించుకుందామని ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. ప్రజలందరూ కలిసి తెలుగుదేశం జనసేన ఉమ్మడి నాయకత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

రైతులు, యువత నోట్లో మట్టికొట్టిన జగన్‌రెడ్డి ప్రభుత్వం

మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 8: నమ్మి ఓట్లువేసిన పాపానికి జగన్‌రెడ్డి రైతాంగం, యువతరం నోట్లో మట్టికొట్టారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. ఒక్క వ్యక్తి వల్ల ఒక రాష్ట్రం, ఒక తరం ఇంతగా నష్టపోయిన సందర్భం రాష్ట్రంలో, దేశంలో ఎప్పుడూ, ఎక్కడా లేదన్నారు. చిలకలూరిపేట క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడుతూ దగా పడిన ధాన్యం రైతుల ఆక్రందనలు, రోడ్డున పడిన ఉద్యాన, వాణిజ్య పంటల రైతుల ఆక్రోశాలే జగన్ అసమర్థ పాలనకు నిదర్శనం అన్నారు. మెగా డీఎస్సీ లేదు, ఏటా జాబ్ క్యాలెండర్లు లేవు, భర్తీ చేస్తామన్న 2.3 లక్షల ఉద్యోగాలూ లేవన్నారు. ప్రైవేట్‌రంగంలోనైనా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు చూసుకుందామంటే ఈ సైకో పాలనలో పెట్టుబడులు, పరిశ్రమలు పారిపోయేలా చేశారన్నారు. వీటి ఫలితంగా నిరుద్యోగంలో రాష్ట్రాన్ని దేశంలో నెంబరు 1 స్థానంలో నిలిపారని ప్రత్తిపాటి వాపోయారు. విధ్వంసం తప్ప సంపద సృష్టి అన్న మాటే లేదన్నారు. రానున్న టీడీపీ, జనసేన ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పనే ప్రాధాన్యాలు కానున్నాయన్నారు.

పొందుగల చెక్‌పోస్టు వద్ద రూ.12.50 లక్షల నగదు స్వాధీనం

దాచేపల్లి, జనవరి 8: రాష్ట్ర పోలీస్ చెక్‌పోస్టు పొందుగల వద్ద ఎటువంటి ఆధారాలు లేని రూ.12లక్షల 50వేల నగదును పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. దాచేపల్లి ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో పొందుగల పోలీస్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ కారును తనిఖీ చేయగా అందులో 12 లక్షల 50 వేల రూపాయల నగదు వుండటాన్ని గుర్తించారు. హైదరాబాద్‌లోని షాద్‌నగర్‌కు చెందిన వైకుంఠ మధుసూదనరావుకు చెందిన నగదుగా గుర్తించారు. అతనివద్ద ఎటువంటి బిల్లులు, రసీదులు లేకపోవడంతో పోలీసులు ఆ నగదును స్వాధీనం చేసుకొని ఇన్‌కంట్యాక్స్ అధికారులకు స్వాధీనం చేశారు.

సీఎం రివర్స్ పాలన మాకొద్దు

● అభివృద్ధిలో దూసుకుపోయే నాయకుడు కావాలి ● 1483వ రోజుకు రైతుల ఆందోళనలు



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, జనవరి 8: సీఎం జగన్‌రెడ్డి రివర్స్ పాలన మాకొద్దు అని అభివృద్ధిలో ముందుకు దూసుకుపోయే నాయకుడు కావాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ, రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1483వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి పలువురు రైతులు మహిళలు మాట్లాడుతూ, మూడు రాజధానుల ప్రతిపాదన పెట్టి రాష్ట్రాభివృద్ధి లేకుండా చేస్తున్నారన్నారు. ఐదుకోట్ల మంది కోరుకునే అమరావతి రాష్ట్రం నడి బొడ్డులో ఉందన్నారు. అన్ని సౌకర్యాలతో అభివృద్ధి పనులు కొనసాగుతుంటే సీఎం జగన్‌రెడ్డి వచ్చి బ్రేక్ వేశాడన్నారు. అమరావతిని నిర్వీర్యం చేయటం అంటే శత్రువులు వచ్చి అభివృద్ధిని అడ్డుకున్నట్టు ఉందన్నారు. పాలన చేతకాకపోతే దిగిపోవాలన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేయటం దుర్మార్గమన్నారు. వేల ఎకరాలుండి కూడా రాజధాని నిర్మాణం కొనసాగించలేక పోవటం రాజకీయ దురుద్దేశమన్నారు. రాగద్వేషాలకు అతీతంగా పరిపాలన చేస్తామని ప్రతిజ్ఞ చేసి మాట తప్పారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి, అభివృద్ధి పనులు కొనసాగించాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. తుళ్లూరు, మందడం, వెలగపూడి, వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం, ఉద్దండ్రాయునిపాలెం తదితర రైతు ధర్నా శిబిరాలలో ఆందోళనలు కొనసాగాయి.

పాలిటెక్నిక్ లెక్చరర్లకు సాంకేతిక అంశాల్లో సమగ్ర శిక్షణ

ఏపీ సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి



ప్రసంగిస్తున్న ఏపీ సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి

మంగళగిరి సిటీ, జనవరి 8: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల అభివృద్ధే లక్ష్యంగా వివిధ సంస్కరణలు చేపడుతున్నామని, అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడంతోపాటు లెక్చరర్లకు సాంకేతిక అంశాల్లో సమగ్ర శిక్షణ ఇస్తున్నామని ఏపీ సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సీ నాగరాణి చెప్పారు. మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఆరు రోజులపాటు జరుగనున్న పాలిటెక్నిక్ లెక్చరర్ల శిక్షణా తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కమిషనర్ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగివున్న మేథాశక్తిని వెలికితీయాల్సిన బాధ్యత లెక్చరర్లదే అన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా మాట్లాడుతూ టీచర్లు, విద్యార్థుల నడుమ సరైన అవగాహన వుండాలన్నారు. సాంకేతికపరమైన అన్ని విషయాల్లోనూ పాలిటెక్నిక్ లెక్చరర్లు సంపూర్ణ అవగాహన పెంచుకోవాలన్నారు. శిక్షణాపరంగా అవసరమైన సహకారాన్ని ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ అందిస్తుందని తెలిపారు. అనంతరం టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చెన్నయ్‌కు చెందిన ఎన్‌ఐటీటీటీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేంద్రరావు, సంయుక్త సంచాలకులు వి.పద్మారావు, డీడీలు నాగేశ్వరరావు, ఎంఏపీ రామకృష్ణ, ప్రొఫెసర్ బాలగురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కళాశాలల నుంచి 128 మంది లెక్చరర్లు తరగతులకు హాజరయ్యారు.

కౌలు చెల్లించాలని సీఆర్డీఏ కార్యాలయం ముందు ధర్నా



విజయవాడ సీఆర్డీఏ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రాజధాని రైతులు, మహిళలు, రైతు కూలీలు

తుళ్లూరు, జనవరి 8: రాజధాని అమరావతి నిర్మాణానికి 33 వేల ఎకరాలు భూములిచ్చిన రైతులకు జీవనోపాధి పోతుందని పది సంవత్సరాలు కౌలు చెల్లించేలా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకొని ప్రతి ఏడాది మేలో కౌలు చెల్లిస్తూ వచ్చింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అమరావతి నిర్మాణ పనులు నిలిపివేయటంతో పాటు వార్షిక కౌలు చెల్లింపులో జాప్యం చేస్తోంది. ఎప్పటికప్పుడు కౌలు కోసం రైతులు రోడ్డు మీదకు వచ్చి ధర్నా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఏడాది మే నెలలో వేయాల్సిన కౌలును ఇంతవరకు జమ చేయలేదు. దీంతో సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ సీఆర్డీఏ కార్యాలయం ముందు రాజధాని గ్రామాల రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా నిర్వహించారు. రైతు కూలీలకు ఇచ్చే పింఛన్‌ను రూ.5వేలకు పెంచి ఇస్తామని సీఎం జగన్‌రెడ్డి ఎన్నికల ముందు హామీనిచ్చారు. అది కూడా నెరవేర్చలేదని వారు పేర్కొన్నారు. తొలుత సీపీఐ రాష్ట్ర నేతలు రామకృష్ణ, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రైతులు, మహిళలు, రైతు కూలీలు రాజధాని అమరావతిలో సమస్యలు పరిష్కరించాలని సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ అలీంబాషకు వినతిపత్రం అందజేశారు. తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో తగినంత మంది సిబ్బంది లేరని, రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ఇబ్బంది కలుగుతోందని జేఏసీ నేతలు అదనపు కమిషనర్‌కు విన్నవించారు. సాధ్యమైనంతవరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన రైతులకు హామీనిచ్చారు. తదనంతరం సీఆర్డీఏ కార్యాలయం ముందు కౌలు చెల్లించాలని ధర్నా చేశారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధులు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 8: స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీని సోమవారం న్యూఢిల్లీలో గల ఎంబసీ ఆఫ్ జపాన్ ప్రతినిధులు సందర్శించారు. ముందుగా ఎంబసీ ఆఫ్ జపాన్ ప్రతినిధులైన కౌన్సిలర్ కెంటారో ఒరిటా, సెకండ్ సెక్రటరీ రైతా సైటో, అడ్మినిస్ట్రేటివ్ అటాచీ రికుతో ఐటోలకు విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణం ఘన స్వాగతం పలికారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జపాన్ లాంగ్వేజీ సెంటర్ ఏర్పాటుచేయాలని జపాన్ ప్రతినిధులను కోరారు.

ఆర్వీఆర్ జేసీకి పరిశోధనలో అరుదైన పురస్కారం



అధ్యాపకుల్ని అభినందిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 8: స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల పరిశోధన విభాగానికి ఏఐసీటీఈ నుంచి పురస్కారం లభించినట్లు కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ, భారత ప్రభుత్వ ఇన్నోవేషన్ సెల్, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఏఐసీటీఈల సంయుక్త ఆధ్వర్యంలో కేఎల్ యూనివర్సిటీలో జరిగిన "ఇన్నోవేటివ్ భరత్ - ఐఐసీ రీజినల్ మీట్-2023"లో ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఇందులో కళాశాల బృందం ప్రదర్శించిన "నానోఫైబ్రోస్ డ్రెస్సింగ్"కు ప్రథమ బహుమతి లభించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు సోమవారం ప్రశంసా పత్రాన్ని అందించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ నుంచి గుంటూరుకు అక్రమంగా మద్యం రవాణా

● 165 మద్యం బాటిళ్లు స్వాధీనం, నిందితుడి అరెస్ట్

● ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎం వెంకటేశ్వరరావు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ఎం వెంకటేశ్వరరావు

గుంటూరు (కార్పొరేషన్), జనవరి 8: తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ నుండి గుంటూరుకు అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సోమవారం ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. గుంటూరు అమరావతి రోడ్‌లోని నగరాలకు చెందిన పాలెం రామ్మోహనరావు నల్గొండలో 165 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి గుంటూరు తీసుకొచ్చారు. నగరాల్లోని పట్టాభిసీతారామయ్యనగర్ రెండో లైనులో ఉంచినట్లు సెబ్ అధికారులకు అందిన సమాచారం మేరకు నిందితుడిని అదుపులో తీసుకొని మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుని అరెస్ట్‌చేసి కోర్టు హాజరు పరిచినట్లు అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో టూ టౌన్ సీఐ కర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పార్లమెంటు నియోజకవర్గాల కాంగ్రెస్ కోఆర్డినేటర్ల నియామకం

● గుంటూరు పార్లమెంట్‌కు ఉమాశంకర్

గుంటూరు, జనవరి 8: ఉమ్మడి జిల్లాలోని మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్లను ఏఐసీసీ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లోక్‌సభ స్థానాలకు కోఆర్డినేటర్లను నియమిస్తూ ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామకపు ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గానికి కృష్ణా జిల్లాకు చెందిన న్యాయవాది, ఆ పార్టీ నేత గంగిశెట్టి ఉమాశంకర్, నరసరావుపేట పార్లమెంటుకు విజయవాడకు చెందిన న్యాయవాది, ఏపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వీ గురునాథం, బాపట్ల ఎస్సీ రిజర్వ్‌డ్ పార్లమెంటు నియోజకవర్గానికి ఒంగోలుకు చెందిన శ్రీపతి ప్రకాశంను నియమించారు. నగరానికి చెందిన ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్‌ను మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గానికి కో ఆర్డినేటర్‌గా నియమించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో సీనియర్ నేతలను పార్లమెంటు నియోజకవర్గాలకు సమన్వయకర్తలుగా నియమించటం జరిగిందని ఆ పార్టీ నేతలు తెలిపారు.

10న ఇండో ఇజ్రాయేల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన

● పల్నాడు రైతాంగం తరలి రావాలి

● ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు

నకరికల్లు, జనవరి 8: పల్నాడు జిల్లా నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో ఈ నెల 10వ తేదీన వ్యవసాయరంగంలో ప్రతిష్ఠాత్మకమైన ఇండో ఇజ్రాయేల్ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి పల్నాడు ప్రాంత రైతులు తరలి రావాలని నరసరావు పేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు సోమవారం ఓ ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో నాణ్యమైన ఆహార ఉత్పత్తుల దిగుబడికి, ఎగుమతులకు, రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు నూతన వంగడాల వ్యాప్తికి కేంద్రంగా వ్యవహరించే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో ఏర్పాటయ్యే ల్యాబ్‌ల నిర్మాణాలను చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన తెలిపారు.

పంచ సూత్రాలపై మహిళలకు శిక్షణ ఇవ్వాలి



సమీక్షలో మాట్లాడుతున్న మెప్మా సంచాలకులు విజయలక్ష్మి

గుంటూరు సిటీ, జనవరి 8: మహిళల ఆర్థిక అభ్యున్నతికి పంచ సూత్రాలు పాటించేలా వారికి శిక్షణ ఇప్పించాలని, ప్రతి మహిళా సంఘం బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని మెప్మా సంచాలకులు వి.విజయలక్ష్మి అన్నారు. సోమవారం గుంటూరు జడ్పీ మీటింగ్ హాల్లో గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్టీఆర్, ప్రకాశం, వెస్ట్‌గోదావరి, ఏలూరు జిల్లాలకు సంబంధించిన మెప్మా కార్యకలాపాలు, ప్రభుత్వ పథకాలపై ప్రాంతీయ సమీక్ష నిర్వహించారు. జీవనోపాధి మెరుగుపడేలా స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) సభ్యులకు శిక్షణ ఇవ్వాలని విజయలక్ష్మి సూచించారు. పట్టణాలలో మహిళా మార్ట్‌లు, జగనన్న ఈమార్ట్‌లు, పట్టణ ప్రగతియూనిట్‌లు, ఆహా క్యాంటీన్లు, అర్బన్ మార్కెట్లు, చేయూత జీవనోపాధి యూనిట్లు అనేకమైనవి ఏర్పాటుచేయడం జరిగిందని, వాటిని డ్వాక్రా మహిళలే నిర్వహించుకొనేలా శిక్షణను అందించాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వెంకటనారాయణ, వెస్ట్ గోదావరి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇమ్మాన్యుయెల్, ప్రకాశం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రవికుమార్, రామాంజనేయులు, సబ్జెక్టు స్పెషలిస్టులు, స్టేట్ మిషన్ మేనేజర్లు, సిటీ మిషన్ మేనేజర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పిడుగురాళ్ల, జనవరి 8: పట్టణంలోని క్రోసూరు బస్టాండ్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనంకి గ్రామానికి చెందిన బండారు వాసు (18) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వ్యక్తిగత పనుల మీద కోనంకి గ్రామం నుంచి పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ మీదుగా సినిమాహాలు సెంటర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో క్రోసూరు బస్టాండ్ సమీపంలోకి రాగానే మరో రెండు బైకులు పక్కగా వచ్చాయి. వాసు నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన చికిత్సకు గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా అక్కడ చికిత్స పొందు తూ మృతి చెందినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ కృష్ణారావు తెలిపారు.

జగన్ నిర్వాకం వల్ల రాష్ట్రం అదోగతి

- మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జనవరి 8: ఓ వ్యక్తి వల్ల ఒక రాష్ట్రం... ఒక తరం... కోట్లాది మంది ప్రజలు ఎంతో నష్టపోతున్న సందర్భం దేశంలో మన రాష్ట్రం తప్ప ఎక్కడా లేదని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావేదిక కూల్చివేతతో పాలన ప్రారంభించిన జగన్ ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్నివిధాల కూల్చివేశాడని తెలిపారు. వ్యవసాయశాఖను నిర్వీర్యం చేశారన్నారు. ఉద్యానవనశాఖ ద్వారా పంట నష్టపోయిన ఏ ఒక్క రైతు కూడా పరిహారం పొందిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో కౌలురైతు ఆత్మహత్యలలో ఆంధ్రప్రదేశ్ రెండోస్థానం, రైతు ఆత్మహత్యల్లో మూడో స్థానం, రైతు అప్పుల్లో మొదటిస్థానంకు తెచ్చిన ఘనుడు సీఎం జగన్ అన్నారు. పల్నాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేవు... డ్రిప్ ఇరిగేషన్‌కు రాయితీలే రావడం లేదు... మద్దతు ధర అందని ద్రాక్షలా ఉందన్నారు. రివర్స్ టెండరింగ్‌ల పేరుతో ఇరిగేషన్ ప్రాజెక్టులను నాశనం చేశాడన్నారు. పట్టిసీమ పెడితే చంద్రబాబుపై కోపంతో దానిని పట్టించుకోవడం మానేశాడన్నారు. పోలవరం కూడా అదే దుస్థితిలో ఉందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం దిగేంతవరకు పనులు చేయడం మావల్ల కాదంటూ కాంట్రాక్టర్లు చేతులెత్తేయడం సిగ్గుచేటన్నారు. జాబ్ క్యాలెండర్ లేదు.. డీఎస్సీ లేదు.. వచ్చిన పరిశ్రమలను కూడా భయపెట్టి పక్క రాష్ట్రాలకు పారిపోయేలా చేస్తున్నారన్నారు. నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఐటీ రంగమే లేకుండా చేశారన్నారు. రేపటి ఎన్నికలలో జగన్‌ను ఇంటికి సాగనంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా వున్నారన్నారు. మరో మూడు నెలల్లో అమరావతే ప్రజారాజధానిగా మారనున్నదని యరపతినేని తెలిపారు.

దోపిడీ, సంపాదనే ధ్యేయంగా పాలన

ధూళ్ళిపాళ్ళ నరేంద్ర కుమార్



మాట్లాడుతున్న ధూళ్ళిపాళ్ళ నరేంద్ర కుమార్

సత్తెనపల్లి, జనవరి 8: ముఖ్యమంత్రి జగన్ అధి కా రంలోకి వచ్చాక దోపిడీ, సంపాదనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ధూళ్ళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. సోమవారం సత్తెనపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం కోల్పోతున్నామని తెలిసినా వైసీపీ మంత్రులు, ముఖ్యమంత్రి పెద్దఎత్తున వసూళ్ళకు పాల్పడుతున్నారన్నారు. జగన్ సీఎం కాలేడని, ఆ పార్టీ చిత్తుచిత్తుగా ఓడి పోతుందన్నారు. శవాలపై పేలాలు ఏరుకున్నట్టు పెద్దఎత్తున రాష్ట్రంలో వసూళ్ళకు పాల్పడుతున్నారన్నారు. స్థానిక మంత్రి రైతు సమస్యలపై స్పందించడన్నారు. ఇన్సూరెన్స్ డబ్బుల్లో కమీషన్ కోసం మంత్రి కక్కుర్తి పడ్డారన్నారు. పంట పొలాలకు నీరు ఇవ్వలేని పరిస్థితుల్లో మంత్రి ఉన్నారన్నారు. రైతుల సమస్యలను పట్టించుకోని మంత్రి అంబటి సంక్రాంతి సంబరాల పేరిట నియోజకవర్గంలో లాటరీ టిక్కెట్లు అమ్మిస్తున్నారన్నారు. పెన్షన్‌దారులకు సైతం లాటరీ టిక్కెట్‌లు అంటగడుతున్నారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పటం ఖాయన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు తాతా జయప్రకాష్ నారాయణ, మక్కపాటి రామచంద్రరరావు, బండారు నాగరాజు, గుంటూరు ఆశీర్వాదం, అప్పారావు తదితరులు ఉన్నారు.

నేడు పెదకాకాని సమీపంలో గుంటూరు కారం సినిమా ఆడియో ఫంక్షన్



ఆడియో ఫంక్షన్ నిర్వహణకు సిద్ధమవుతున్న వేదిక

పెదకాకాని, జనవరి 8 : ప్రిన్స్ మహేష్‌బాబు నటించిన గుంటూరు కారం సినిమా ప్రీ ఆడియో రిలీజ్ ఫంక్షన్‌కు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గుంటూరు జిల్లా పెదకాకాని సమీపంలోని నంబూరు అడ్డరోడ్డు వద్ద ఈ సినిమా ప్రీ ఆడియో రిలీజ్ ఫంక్షన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఈ ఫంక్షన్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. హారిక హాసిన్ బ్యానర్‌పై నిర్మాత రాధాకృష్ణ(చిన్నబాబు), దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సారథ్యంలో సూపర్‌స్టార్ మహేష్ బాబు, అందాల భామ శ్రీలీల హీరోహీరోయిన్లుగా నటించిన గుంటూరు కారం సినిమా ప్రీ రిలీజ్ ఆడియో ఫంక్షన్ పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ఈ సినిమాలో నటించిన మీనాక్షి చౌదరి, రమ్యకృష్ణ, ప్రకాష్‌రాజ్, రావు రమేష్ తదితరులు ఈ వేడుకకు హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

20న రాష్ట్ర జూనియర్ బాలబాలికల క్యారమ్స్ జట్ల ఎంపిక

గుంటూరు(తూర్పు), జనవరి 8: ఆంధ్రా స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విజయవాడ, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 20వ తేదీన రాష్ట్ర జూనియర్ బాలబాలికల క్యారమ్స్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ ప్రధానకార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు బాలబాలికలు అయితే 2006 తరువాత, యువతీ, యువకులైతే 2003 తరువాత పుట్టినవారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 91774 79119 నెంబరును సంప్రదించాలని సూచించారు.

నూతన భవన సముదాయానికి రూ.6లక్షల విరాళం



పాలకవర్గ సభ్యులకు చెక్కును అందజేస్తున్న దాతలు

గుంటూరు(తూర్పు), జనవరి 8: జేకేసీ రోడ్డులోని కమ్మజనసేవాసమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవనసముదాయంలో ఒక గది నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తం రూ.6లక్షలను విరాళంగా కీర్తిశేషులు ముప్పాళ్ల సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు ప్రకటించారు. ఈ మేరకు బృందావన్‌గార్డెన్‌లోని బాలికల వసతిగృహంలో సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు ఆయన కుటుంబసభ్యులు కస్తూరి, నిమ్మగడ్డ పద్మజ, విద్యాసాగర్, ఆకాష్ సాయిశ్రీ, శ్రీఅన్వేష్ కలసి చెక్కును అందజేశారు. అనంతరం సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ ముప్పాళ్ల సుబ్బారావు కుటుంబసభ్యులు గతంలో ఒక గది నిర్మాణానికి అవసరమైన నిధులు ఇచ్చారని, మరో గదికి విరాళం ఇవ్వడం హర్షణీయమన్నారు. రెండు సంవత్సరాల్లో నూతన భవనాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి కోశాధికారి గోరంట్ల పున్నయ్యచౌదరి, ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, సంయుక్త కార్యదర్శి గుంటుపల్లి కోటేశ్వరరావు, పాలకవర్గసభ్యులు పెద్ది సాంబశివరావు, వడ్లమూడి శివసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	83, 98, 105
చికెన్ విత్ స్కిన్	170.00
చికెన్ స్కిన్ లెస్	180.00

పల్నాడు వార్తలు

చంద్రబాబునాయుడుకు ఎలినేడి కృతజ్ఞతలు


చంద్రబాబు నాయుడుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎలినేడి రామస్వామి

సత్తెనపల్లి, జనవరి 8 : టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఎలినేడి రామస్వామి సోమవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును కలిసి బొకే అందించి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి కారకుడైన పార్టీ అధ్యక్షుడు కే అచ్చెన్నాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ అంజనేయులుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కన్నా లక్ష్మీ నారాయణను, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రను ఆయన సన్మానించారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేత ఆకుల


ఆకుల హనుమంతురావుకు టీడీపీ కండువాను కప్పుతున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి జనవరి 8: వైసీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆకుల హనుమంతురావుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ సోమవారం రాత్రి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హనుమంతురావు 31వ వార్డు వైసీపీ ఇన్‌చార్జ్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా హనుమంతురావు మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణంలో టీడీపీ అభివృద్ధికి, కన్నా విజయానికీ కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు, వార్డు టీడీపీ అధ్యక్షుడు మునిని బాబు, రాంభోబుడే తదితరులు ఉన్నారు.

ఎస్‌టీయూ మండల నూతన కార్యవర్గం

అచ్చంపేట, జనవరి 8 : అచ్చంపేటలో సోమవారం ఎస్‌టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు గౌరవ అధ్యక్షుడు షేక్ ఇంతియాజ్ అహమ్మద్ తెలిపారు. ఎస్‌టీయూ మండల అధ్యక్షులుగా గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా వేణు గోపాల్, ఆర్థిక కార్యదర్శిగా పీవీఆర్ కృష్ణారెడ్డి, సహాధ్యక్షులుగా ఎం మాధవి ఎంపికయ్యారు. జిల్లా కౌన్సిలర్‌గా కే బాల గంగాధర్, ఎం శ్రీనివాసరావు, షేక్ మహబూబ్ సుభానీ, పొన్నెకంటి సురేష్, బీ వీరవాసు, డీ కేశవ, టీ దాసు ఎంపికయ్యారు. ఎస్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్ జీ దేవరాజు, బత్తుల సాంబశివరావు ఈ ఎంపికను పర్యవేక్షించారు.

రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

రాజుపాలెం, జనవరి 8: మండలంలోని రాజుపాలెంలో ఉన్న పులి చింతల పునరావాస కేంద్రంలోని లబిధదారులకు నివాస పట్టాలను పంపిణీ చేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి పులిచింతల డిప్యూటీ కలెక్టర్ వసంతరావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మంత్రి అంబటి రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి రాంబాబు మాట్లాడుతూ పులిచింతల నిర్మాణం సమయంలో మొత్తం 12కాలనీల్లో 5,376 నివాసాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీరందరికీ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శ్యాంప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు, ఆర్డీవో రాజాకుమారి, తహసీల్దార్ నళిని, ఎంపీడీవో శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెకు ఎస్టీయూ సంఘీబావం



సంఘీబావం తెలుపుతున్న ఎస్టీయూ నేతలు

మాచర్ల రూరల్, జనవరి 8: పట్టణంలో మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు సోమవారం ఎస్టీయూ నేతలు తమ సంఘీబావం తెలిపారు. పారిశుధ్య కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని, వారి సమస్యలను ప్రభుత్వం పరి ష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమ్ము కిషోర్, గంగాధర్, జాన్ డేవిడ్, అబ్రహం లింకన్, ఆలేటి జ్ఞానమ్మ, అన్నమ్మ, పేరుపోగు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య సిబ్బంది సమ్మె

● పేరుకుపోతున్న చెత్తా చెదారం

పిడుగురాళ్ల, జనవరి 8: పారిశుధ్య కార్మికులు 14 రోజులుగా సమ్మె చేస్తుండటంతో పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుంది. పర్మి నెంట్ వర్కర్స్ కొద్ది మందే ఉండటంతో 33 వార్డుల్లో కాల్వలు శుభ్రం చేయడం, తొలగించిన చెత్తను వాహనాల్లోకి ఎత్తటం వంటివి వీలుకాక పోవడంతో పట్టణంలో కాల్వల వద్ద చెత్త చెదారం కుప్పలుగా పడి దుర్వాసన వస్తోంది.

దేవాలయం నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు

మాచవరం, జనవరి 8: మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో సుగాలీ సేవాలాల్ దేవాలయం నిర్మించుకునేందుకు టీటీడీ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసిందని దేవదాయశాఖ ఈవో పుణ్యాల వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం దేవాలయం నిర్మించేందుకు కావలసిన స్థలాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన సుగాలీల కోరిక మేరకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి 10 లక్షల రూపాయలు మంజూరు చేయించినట్లు తెలిపారు. స్థలపరిశీలన కార్యక్రమంలో సర్పంచ్ మండ్ల మంగమ్మ రామకోటయ్య, యార్డు డైరెక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణ

కారంపూడి, జనవరి 8: వైసీపీ నేతలు ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటున్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్ అన్నారు. సోమవారం కారంపూడిలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలపై అధికార పార్టీ నేతల కన్ను పడిందన్నారు. గాదెవారిపల్లెలోని విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. మాచర్ల పట్టణంలో వైసీపీ నేతలు ప్రభుత్వ స్థలాలను పంచుకొని గృహాలను కూడా నిర్మించుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు వీరికి సహకరిస్తున్నారని, త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని చెప్పారు. వైసీపీ నేతల కబ్జాల జాబితా తమ ఉందని, త్వరలోనే బయటకు తీస్తామని, కబ్జాలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధి పెట్టాలని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌జాని, కార్యదర్శి తోట నరసింహారావు, ఎస్సీ సెల్ కన్వీనర్ కాల్వ పేరయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలునాయక్, మండల మాజీ అధ్యక్షుడు చప్పిడి రాము, ఒప్పిచర్ల బొల్నేడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడి రాజీనామా

పిడుగురాళ్ల, జనవరి 8: పిడుగురాళ్ల మండలం రైస్ మిల్లర్స్ అసోసి యేషన్ అధ్యక్ష పదవికి సోమవారం రాజీనామా చేసినట్లు యేలూరి శ్రీనివాసరావు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో తాను రాజీనామా చేస్తున్నట్లు అసోసియేషన్ పెద్దలకు రాజీనామా లేఖను శ్రీనివాసరావు సోమవారం అందజేశారు.

చెకుముకి రాష్ట్ర పోటీలకు వివేకా టెక్నో విద్యార్థులు

రెంటచింతల, జనవరి 8: రెంటచింతలలోని వివేకా టెక్నో స్కూల్ విద్యార్థు లు చెకుముకి సైన్స్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు డైరెక్టర్లు జక్కిరెడ్డి కృష్ణారెడ్డి, వెంకటరెడ్డిలు చెప్పారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ప్రై వేట్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో పి.శివరామకృష్ణారెడ్డి, ఎం అఖిల్, బి.మహేశ్‌రెడ్డిలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఫిబ్రవరి 10, 11 తేదీల్లో చిలకలూరిపేటలోనే రాష్ట్రస్థాయి పోటీలుంటాయని వారు పేర్కొన్నారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

మాచర్ల, జనవరి 8: పెన్షనర్లందరూ లైఫ్ సర్టిఫికెట్లను ట్రెజరీ కార్యాలయంలో సమర్పించాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నందా నరసింహయ్య తెలిపారు. పట్టణంలోని పెన్షనర్స్ కార్యాలయంలో సోమవారం జరిగిన అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. పెన్షనర్లు ఏమైనా సమస్యలుంటే కార్యాలయంలో సంప్రదించి పరిష్కరించుకోవచ్చన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె


సత్తెనపల్లి తాలూకా సెంటర్లో డప్పు కొట్టి నిరసన తెలియ జేస్తున్న అంగన్‌వాడీలు

సత్తెనపల్లి, జనవరి 8: స్థానిక తాలూకా సెంటర్లో కొనసాగిస్తున్న సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ నాయకులు మాట్లాడుతూ ఎస్మా ప్రయోగించినా వెనక్కి తగ్గేదేలేదంటూ నిరసన తెలిపారు. తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం పరిష్కరించకుండా ఎస్మాను ప్రయోగించటం దుర్మార్గం అన్నారు. డప్పు కొడుతూ తమ నిరసనల ను తెలియజేశారు. పది మంది అంగన్‌వాడీ టీచర్లు 24గంటల పాటు దీక్ష చేస్తామని తెలిపారు. దీక్షలో సుజాత, అహల్య, చాముం డేశ్వరి, అంజలి, మహేష్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

● అంగన్‌వాడీల 24 గంటల సమ్మెలో బాగంగా సత్తెనపల్లి పట్టణంలోని తాలూకా సెంటర్లో ఏర్పాటు చేసినశిబిరంలో సోమవారం రాత్రి 10మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శిబిరంలోనే నిద్రించారు. వారికి మరో 10మంది కార్యకర్తలు సీఐటీయూ నేతలు మద్దతుగా నిలిచారు.

పిడుగురాళ్ల, జనవరి 8: రాష్ట్ర వ్యాప్తంగా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 29 రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె సోమవారం కూడా కొనసాగింది. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద పిడుగురాళ్ల, మాచవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన కొనసాగిస్తూ జగన్మోహన్‌రెడ్డి, ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నినదిస్తూ ధర్నాను కొనసాగించారు. మంత్రులు ఒకమాట.. అధికారులు ఒకమాట అన్నట్టుగా కాలాతీతం చేస్తున్నారే తప్ప డిమాండ్‌లను నెరవేర్చడం లేదని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించే వరకు ఎన్నాళ్లయినా ధర్నా కొనసాగిస్తామని అంగన్‌వాడీ యూనియన్ వర్కర్స్ నాయకురాలు హజ్రా, శాంతమణి తెలిపారు.

బోగిమంటల్లో ఎస్మా జీవో కాపీలు వేసి నిరసన

అమరావతి, జనవరి 8: 28 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన దీక్షలు చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎస్మా చట్టం ప్రయోగిస్తా మని వైసీపీ ప్రభుత్వం జీవో విడుదల చేసిన ప్రతులను సోమవారం దీక్షా శిబిరం వద్ద ఏర్పాటు చేసిన బోగిమంటలో వేసి దహనం చేశారు. వీరికి సంఘీభావంగా సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు సూరిబాబు, శ్రీనివాసరావు, రామకృష్ణలు సంఘీభావం తెలిపారు.

క్రోసూరు, జనవరి 8 : అంగన్‌వాడీలను ఉద్యోగాల నుంచి తొలగించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదని సీఐటీయూ జిల్లా నాయకులు గంజిమాల రవిబాబు అన్నారు. క్రోసూరులో 28 రోజులుగా జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మె, నిరసన శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా వారిపై కక్ష సాధింపులకు దిగటం శోచనీయం అన్నారు. నిరసన శిబిరంలో సీఐటీయూ నాయకులు తిమ్మిశెట్టి హనుమంతరావుతో పాటు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శివపార్వతి, జయలక్ష్మి పాల్గొన్నారు.

రెంటచింతల, జనవరి 8: అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దారుణమని, న్యాయమబద్ధమైన డిమాండ్లను పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ పాలకులు వ్యవహరించడం సిగ్గు చేటని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గాడిపర్తి శ్రీనివాసరావు విమర్శించారు.

అవ్వాతాతల దీవెనలతో వైసీపీ గెలుపు

● ఎమ్మెల్యే పీఆర్కే

దుర్గి, జనవరి 8: అవ్వాతాతల దీవెనలతో వైసీపీ విజయం సాధిస్తుందని స్థానిక ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. దుర్గి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల పరిధిలో 6948మందికి పెన్షన్లను అందజేశారు. అలాగే ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. నెహ్రూనగర్‌లో తండాలో నూతనంగా నిర్మించ తలపెట్టిన మహాలక్ష్మమ్మ ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలను అందించారు. ఈ కార్యక్ర మంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ వెలిదండి గోపాల్, ఎంపీపీ యేచూరి సునీతాసాయిశంకర్, జడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, మండల కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయి, యువజన నాయకులు యకటీల బుచ్చిబాబు, కటకం చిన వెంకటయ్య, తోటకూర నాగేశ్వరరావు, పసుపులేటి వెంకట్రామయ్య, దేశం శ్రీనివాసరెడ్డి, ఊరిబిండి ఏగయ్య, ఉన్నం వెంకటేశ్వర్లు (చిన్నబ్బాయి), చల్లా శ్రీను, శెట్టిపల్లి కోటేశ్వరరావు, జక్కా బాజీ, కటకం రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

దాచేపల్లి, జనవరి 8: ఇంట్లో దుస్తులు ఆరేసిన దండెం వైరుకు కరెంటు సరఫరా కావడంతో దుస్తులు తీసేందుకు యత్నిస్తున్న వివాహిత మహిళ విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాగెండ్ల కృపాలమ్మ (39) ఇంట్లో దండెంపై దుస్తులు ఆరేసిన వాటిని తీస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ వద్ద ఉన్న విద్యుత్ వైరు ఫ్యాన్ బిగించే రాడ్‌కు తాకడంతో అక్కడి నుంచి దండెం వైరుకు విద్యుత్ సరఫరా అయింది. కృపాలమ్మ దండెంపై దుస్తులు తీస్తుండగా విద్యుత్‌షాక్‌తో స్పృహ తప్పి పడిపోయింది. ఈ సంఘటనతో స్థానికులు, కుటుంబసభ్యులు కలిసి కృపాలమ్మను ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె మార్గంమధ్యలో మృతి చెందింది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భర్త నాగెండ్ల మహేష్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

గ్రంధసిరిలో నివేశన స్థలం కబ్జాపై ఆరోపణ

అచ్చంపేట, జనవరి 8: మండలంలోని గ్రంధసిరి గ్రామంలో పూర్వీకులు ద్వారా సంక్రమించిన నాలుగు సెంట్ల నివేదన స్థలాన్ని కబ్జా చేశారని కిలారి సుధాకర్ సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. కిలారీ సుధాకర్ తెనాలి మండలం బుర్రిపాలెంలో ఉంటున్నాడని, గ్రంధసిరి గ్రామంలో తన పూర్వీకుల ద్వారా వచ్చిన స్థలాన్ని అదే గ్రామానికి చెందిన అడుసుమల్లి లక్ష్మయ్య కబ్జా చేసినట్టు వినతి పత్రంలో తెలిపారు. అధికారులకు తెలియ జేసినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుధాకర్ తండ్రి కిలారి సాంబయ్య పేరిట ఉన్న భూమిని అప్పగించాలంటూ ఉన్నతాధికారులను కోరారు.

సారా విక్రేత అరెస్టు

● పది లీటర్ల కాపు సారా స్వాధీనం

● వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

బెల్లంకొండ, జనవరి 8 : సారా కాచే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న పది లీటర్ల సారా స్వాధీనం చేసుకొని వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసిన ఘటన బెల్లంకొండ మండలంలోని కేతవరం తండా అటవీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ నజీర్ తెలిపిన వివరాల ప్రకారం కేతవరం అటవీ ప్రాంతంలో సారా తయారు చేస్తున్నట్టు సమాచారం రావటంతో పోలీసులు వెళ్లారు. సారా తయారు చేస్తున్న కేతవ రం తండాకి చెందిన బాలూనాయక్ పోలీసులను చూసి పారి పోతుండగా అతన్ని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. సారా తయారు చేసే బట్టిని, బెల్లం ఊటను ధ్వంసం చేసి పది లీటర్ల కాపు సారాను స్వాధీనం చేసుకున్న ట్టు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్టు పేర్కొన్నారు. బెల్లంకొండ మండలంలో కాపు సారా తయారు చేసినా, మద్యం విక్రయించి నా, తెలంగాణా మద్యం విక్రయించినా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది హుస్సేన్, రాజేష్, ఎల్ వెంకటేశ్వర్లు, వెంకటరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేతల అరెస్టు

మాచవరం, జనవరి 8: మాచవరంలో మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారివద్ద ఉన్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సమీర్‌బాషా సోమవారం తెలిపారు. మాచవరం గ్రామానికి చెందిన కావాటి సురేష్, గంజి శ్రీనివాసరావులను అరెస్టు చేసి వారివద్ద ఉన్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

జూద స్థావరంపై దాడి.. రూ.8వేలు స్వాధీనం

దుర్గి, జనవరి 8: మండలంలోని అడిగొప్పుల శివారులోని పరుపుల ఫ్యాక్టరీ సమీపంలోని పొలంలో ఆదివారం రాత్రి ఎస్ఐ శివ తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.8 వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

ఎన్నికల నేపథ్యంలో 40 మంది బైండోవర్

ముప్పాళ్ళ జనవరి 8: సాధారణ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 40మందిని బైండోవర్ చేసినట్లు ముప్పాళ్ళ ఎస్ఐ కిషోర్‌బాబు సోమవారం తెలిపారు. రుద్రవరం, దమ్మాలపాడుకు చెందిన వారిని తహసీల్దార్ ముందు హాజరు పరిచామన్నారు. నేరచరిత్ర కలిగిన వారిపై నిఘా ఉంచామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దుర్గి, జనవరి 8: మండల పరిధిలోని రాజానగర్ గ్రామ శివారు పొలాల్లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ శివ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతడి శరీరంపై నలుపురంగు చొక్కా ఉన్నాయి. సమాచారం తెలిసిన వారు స్టేషన్లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

బాబు వస్తేనే ఎస్సీకాలనీల అభివృద్ధి

● ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాతులూరి కుమార్


గుత్తికొండలో దళిత యువగర్జన సభలో మాట్లాడుతున్న దళిత నేతలు

పిడుగురాళ్ల, జనవరి 8: బాబు అధికారంలోకి వస్తేనే ఎస్సీ కాలనీలన్నీ అభివృద్ధికి నోచుకోవడంతో పాటు సామాజికవర్గం కూడా ఆర్థికంగా బలోపేతమవుతుందని పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాతులూరి కుమార్ తెలిపారు. గుత్తికొండలో దళిత యువగర్జన, బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం రాత్రి, సోమవారం ఎస్సీ కాలనీలో ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారంటీ పథ కాల గురించి వివరిస్తూ గ్యారంటీ కార్డులను అందజేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే దళితులకు, యువతకు విదేశీ విద్య, కార్పొరేషన్ రుణాలు అందుతాయని కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బండ్ల జోగయ్య, యడ్లపల్లి నారాయణ, బండ్ల శేఖరయ్య, కొండలు, కరాలపాడు గోపాల్, పావులూరి కోటయ్య యడ్లపల్లి శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

ముప్పాళ్ళ జనవరి 8: మండలంలోని మాదలలో బత్తినేని గంగాధర్ జ్ఞాపకార్థం ఇచ్చిన దుప్పట్లను టీడీపీ సత్తెనపల్లి నియోజక వర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ఎస్సీ కాలనీలో వృద్ధులకు, మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరావు, మాజీ ఉప ఎంపీపీ రావిపాటి మధుబాబు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు ఆర్ నానయ్య పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

టీడీపీ, జనసేన కూటమికి 160 సీట్లు ఖాయం

● జనసేన జిల్లా అధికార ప్రతినిధి భావన్నారాయణ

క్రోసూరు, జనవరి 8: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ, జనసేన కూటమి ఘన విజయం సాధించటంతో పాటు 160 సీట్లు తగ్గకుండా గెలుచుకోవటం ఖాయమని జనసేన జిల్లా అధికార ప్రతినిధి తవటి భావన్నారాయణ అన్నారు. సోమవారం ఆయన క్రోసూరు వచ్చి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, జనసేనల మైత్రిని వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు కడియం శివ నాగేశ్వరరావు, మల్లెల వెంకట చలపతిరావు, వాకా అఖిల్, శాఖమూరి శ్రీనివాసరావు, జనసేన నాయకులు పసుపులేటి వెంకటస్వామి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో టీడీపీ, జనసేనదే అధికారం

టీడీపీ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ అలీబాషా


కుంకలగుంటలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు ఆలీ బాషా, మహంకాళిరావు తదితరులు

నకరికల్లు, జనవరి 8: రానున్న సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావటం ఖాయమని టీడీపీ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ అలీబాషా అన్నారు. సోమవారం రాత్రి నకరికల్లు మండలం కుంకలగుంటలో స్థానిక టీడీపీ నేతలతో కలసి ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాలపాటి మహంకాళిరావు, కిష్టంశెట్టి చిన్న, దేరాల గోవిందరాజులు, గోపు శ్రీనివాసరావు, మాదినీడి కోటేశ్వరరావు, మాదినీడి అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వే ఉద్యోగుల నిరాహారదీక్ష

దాచేపల్లి, జనవరి 8: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గుంటూరు డివిజన్ నడికూడి బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్నట్లు నడికూడి బ్రాంచ్ సెక్రటరీ ఆదాంషఫీ సోమవారం తెలిపారు. రైల్వే యూనియన్ నాయకులు మర్రి రాఘవయ్య పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఎన్‌పీఎస్ తీసేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 9వ తేదీ నుంచి నడికూడి రైల్వేస్టేషన్ వద్ద రిలే దీక్షలో ప్రతి ఒక్కరు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తమ నిరసన వ్యక్తం చేయాలని కోరారు.

అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు

దుర్గి, జనవరి 8: మండలంలోని అడిగొప్పులలో ఉన్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. మొత్తం రూ.11,81,708ల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు. ఈ ఆదాయం 39 రోజులపాటు భక్తులు అమ్మవారికి సమర్పించినదిగా చెప్పారు. కారంపూడి గ్రూపు టెంపుల్స్ ఈవో పప్పుల కృష్ణంరాజు, ఆలయ అధికారులు కరాలపాటి సుబ్బారావు, కలవల వెంకటేశ్వర్లు పర్యవేక్షించారన్నారు.

20వ రోజుకు చేరిన సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

రెంటచింతల, జనవరి 8: సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె సోమవారానికి 20వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా నేత మంగయ్య మాట్లాడుతూ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్ ఆర్‌పీ పాలసీ, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జనవరి 8: రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో అతివృష్టి, అనావృష్టి వచ్చి రైతులు అనేక రకాలుగా నష్టపోయారన్నారు. రైతుల సమస్యలపై ప్రతిపక్షాలు పోరాడినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యేలను, మంత్రులను బదిలీ చేసే పనిలో నిమగ్నమయ్యారన్నారు. నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాల పేరిట వైసీపీ నేతలు దోచుకుంటున్నారన్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు, కాంట్రాక్టర్లకు సంక్రాంతి సంబరాల ఎంట్రీ పాసు పుస్తకాలు ఇచ్చి డబ్బులు వసూలు చేయిస్తున్నారన్నారు. పింఛనుదారుల వద్ద నుంచి కూడా వంద రూపాయలు చొప్పున వసూలు చేయటం దుర్మార్గం అన్నారు. ప్రజలను దోచుకుంటున్న ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన ప్రజలకు పిలుపు నిచ్చారు. సమావేశంలో టీడీపీ నేతలు పూజల వెంకట కోటయ్య, బత్తుల ఆదినారాయణ, బత్తుల వెంకట స్వామి, మీసాల శ్రీను తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో వ్యవసాయశాఖను మూసేశారు

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, జనవరి 8: రాష్ట్రంలో వ్యవసాయశాఖను మూసివేశారని, దీనివల్ల రైతులు రోడ్డున పడ్డారని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో రోజుకు ముగ్గురు కౌలు రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. దేశంలోనే కౌలు రైతుల ఆత్మహత్యలతో రాష్ట్రాన్ని రెండో స్థానంలో, రైతు ఆత్మహత్యల్లో మూడో స్థానంలో, రైతు అప్పుల్లో మొదటి స్థానంలో నిలిపిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. రివర్స్ టెండర్ పేరుతో ఇరిగేషన్‌ను సర్వనాశనం చేశారని, జగన్ పాలనలో ప్రధాన బాధితులు యువత ఉద్యోగ అవకాశాలు లేక పెడదారిన పట్టి చెడు వ్యసనాలకు బానిసలయ్యారని తెలిపారు. 90 రోజుల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని, అమరావతి పునర్నిర్మాణం జరుగుతుందని వివరించారు.

నియోజకవర్గ రాహుకేతువులు పిన్నెల్లి సోదరులు

● జూలకంటి బ్రహ్మారెడ్డి

మాచర్ల, జనవరి 8: ఎన్నికలకు ముందు వరికపూడిశెల ప్రాజెక్ట్ పూర్తి చేసి పొలాల్లో నీరు పారిస్తేనే ఓట్లు అడుగుతా అని బీరాలు పలికావు.. ఇప్పుడు ఏ మోహం పెట్టుకొని ప్రజలను ఓట్లగుతావు అంటూ స్థానిక ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి మండిపడ్డారు. హడావిడిగా ముఖ్యమంత్రితో ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేయించావు.. ఆ పనులు మొదలెట్టారా.. వంద కోట్లు దాటితే జ్యూడిషియల్ అనుమతి అన్నావు.. రివర్స్ టెండరింగ్ అన్నావు.. ఏమయ్యాయి నీ మాటలు.. టీడీపీ హయాంలో క్యాబినెట్ అనుమతి పొందిన దాని మీదేగా మరలా టెంకాయ కొట్టింది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలల్లో టెంకాయ కొడితే విశ్వసనీయత.. ఎన్నికలకు ఆరు నెలల ముందు టెంకాయ కొడితే మోసం అని మీరు చెప్పిన మాటలను బట్టి మీరు ఏ కోవకు వస్తారో చెప్పి పల్నాడు ప్రజలను ఓట్లు అడగాలి లేదా క్షమాపణ చెప్పాలని దుయ్యబట్టారు. రైతులకు సబ్సిడీపై అందించాల్సిన ఎరువులను పక్కదారి పట్టించిన ఘనులు పిన్నెల్లి సోదరులని విమర్శించారు. ఖరీఫ్ సీజన్‌లో ఎండిపోతున్న పంటలకు నీరందించకుండా రాక్షసానందం పొందిన నియోజకవర్గ రాహుకేతువులు పిన్నెల్లి సోదరులని ఘాటుగా వ్యాఖ్యానించారు. రైతులు తమ పొలాలకు పాసు పుస్తకాలు పొందాలంటే రేటు నిర్ధారించి వసూలు చేసిన వసూలు రాజాలు పిన్నెల్లి సోదరులని బ్రహ్మారెడ్డి ఎద్దేవా చేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వాటర్ ట్యాంకులును కూడా వదిలిపెట్టకుండా మీ ప్రచార పిచ్చితో వాటికి పార్టీ రంగులు పులిమారు.. కార్యకర్తలకు న్యాయం చేయలేకపోయా.. మరోమారు గెలిపిస్తే న్యాయం చేస్తానంటూ బహిరంగంగా వేడుకుంటున్నా నిన్ను నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరని బ్రహ్మారెడ్డి అన్నారు.

మోర్జంపాడు హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

మాచవరం, జనవరి 8: మండలంలోని మోర్జంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సంక్రాంతి సెలవులలో భాగంగా చివరిరోజు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి రంగు రంగుల ముగ్గులు వేసి పొంగళ్లు చేసి హరిదాసులకు నవధాన్యాలు సమర్పించి సన్మాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమం పాఠశాలలో ఎంతో ఉత్సాహంగా జరిగింది. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులలో నూతన ఉత్సాహాన్ని నింపారు.

రుద్రవరంలో ఇంటింటికి కొమ్మాలపాటి కార్యక్రమం

అచ్చంపేట, జనవరి 8 : మండలంలోని రుద్రవరం గ్రామంలో సోమవారం ఇంటింటికి కొమ్మాలపాటి అనే కార్యక్రమం నిర్వహించినట్టు తెలుగు యువత మండల నాయకులు పొన్నెకంటి రవిచందు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం ప్రవేశ పెట్టబోయే పథకాలను వివరిస్తూ రిజిస్టర్ చేశారు. తెలుగు యువత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల పరిశీలకులు బత్తుల వెంకటరావు, ఘంటా నాగేశ్వరరావు, వాసిరెడ్డి రవి, గడ్డం ఆంజనేయులు, చల్లా వీర రాఘవయ్య, బిక్కి సీతయ్య, లక్ష్మీనారాయణ, వినోద్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం ఓ బూటకం

● అధికారులు లేకుండా సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి

● అధికారులను ప్రశ్నించిన జడ్పీటీసీ శివయాదవ్


మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ శివయాదవ్

మాచవరం జనవరి 8: ప్రజల సమస్యలు చర్చించి పరిష్కారం కోసం మూడు నెలలకు ఒకసారి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసుకుంటాం. సమావేశానికి పలుశాఖల అధికారులు రాకపోతే ప్రజల సమస్యలు పరిష్కారం ఎలా అవుతాయని సర్వసభ్య సమావేశం ఓ బూటకం అని జడ్పీటీసీ జె.శివయాదవ్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వాపోయారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. పలువురు అధికారులు వారివారి శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సభలో వివరించారు. అనంతరం జడ్పీటీసీ శివయాదవ్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసుకున్న ఈ సమావేశానికి అధికారులు లేకపోతే సమస్యలు పరిష్కరించేది ఎవరని మండల స్థాయి అధికారులను ప్రశ్నించారు. ఇది ఒక బూటక సర్వసభ్య సమావేశమని, జరగాల్సిన రీతిలో సమావేశాలు జరుగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ నుంచి 70 లక్షల రూపాయలు వెచ్చించి పది విద్యార్థులకు విద్యాజ్యోతి మెటీరియల్ పంపిస్తే మాచవరం మండలంలో జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు జడ్పీటీసీకి సమాచారం ఇవ్వకుండానే మెటీరియల్ పంపిణీ చేయడం ఏమిటని, ఎంఈవో శ్రీధర్‌ను ప్రశ్నించారు. ఇలాంటివి మరలా పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. ఉప ఎంపీపీ చింతపల్లి నన్నే సైదా మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కారం కాకపోతే సమావే శాలు ఎందుకని సమావేశంలో ప్రశ్నించారు. మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దారం లక్ష్మిరెడ్డి పలువురు అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన సమాచారాన్ని వివరించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

● ఎస్పీ రవి శంకర్‌రెడ్డి



ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ వై రవి శంకరరెడ్డి

నరసరావుపేట లీగల్, జనవరి 8: స్పందన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించటానికి తగు చర్యలను తీసుకోవాలని పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి సోమవారం పోలీసు అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ రవి శంకర్‌రెడ్డి ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అచ్చంపేట మండలం పెదపాలెం గ్రామానికి చెందిన కృష్ణా నాయక్ అనే వ్యక్తి మునిసిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాల ప్రిన్సిపాల్, ఆమె భర్త తన వద్ద నుంచి ఉద్యోగం ఇప్పిస్తాని రూ.14 లక్షలు తీసుకున్నారని, ఉద్యోగం ఇప్పించకుండా డబ్బులు అడుగుతుంటే ఇవ్వకుండా బెదిరిస్తున్నారని, తగు న్యాయం చేయాలని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. గుత్తికొండ గ్రామానికి చెందిన నలబోలు శ్రీనివాసరావు అనే వ్యక్తి తన కుమారుడిని విదేశాలకు పంపిస్తానని పిడుగురాళ్ళ పట్టణానికి చెందిన ఒక వ్యక్తి వద్ద రూ.15 లక్షలు తీసుకున్నాడని, సదరు వ్యక్తి డబ్బులు ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని ఎస్పీని ఆశ్రయియించాడు. కార్యక్రమానికి వచ్చిన సభ్యులకు ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీసు సిబ్బంది సహకరించారు. దాతలు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఫిర్యాదిదారులకు పోలీసు అధికారులు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్కే చంద్రశేఖర్, డీఎస్పీలు కేవీ మహేష్, ఆదినారాయణ, పల్లపు రాజు, రవిచంద్ర, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



అన్నవరంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న అరవింద బాబు, గోనుగుంట్ల కోటేశ్వరరావు

చంద్రబాబుతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యం

● టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు

రొంపిచర్ల, జనవరి 8: రాష్ట్రంలో అభివృద్ధి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. మండలంలోని అన్నవరంలో ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకోవటమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపడుతుందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు టీడీపీతోనే సాధ్యమవుతందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, పచ్చవ కోటేశ్వరరావు, పచ్చవ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లు 2019లో ఉన్నట్లే ఉంచాలి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ

నరసరావుపేట టౌన్, జనవరి 8: నరసరావుపేట నియోజకవర్గంలో పెట్లూరివారిపాలెం, యలమంద, రావిపాడు, రొంపిచర్లలలో బూత్‌లు 2019 జనరల్ ఎలక్షన్‌లో ఉన్న విధంగా బూత్‌లు ఉంచాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం అన్నారు. నియోజకవర్గంలోని పెట్లూరివారిపాలెంలో 223, 224బూత్‌లు, యలమందలో 232బూత్, రావిపాడులో 72బూత్, రొంపిచర్లలో 36, 37 బూత్‌లను మార్చారన్నారు. దీనివలన ప్రజలు ఇబ్బందులు పడతారని అన్నారు. 2019 ఎలక్షన్‌లో ఏవిధంగా పోలింగ్ బూత్‌లు ఉన్నాయో ఆదే విధంగా కొనాగించాలని కోరారు. గ్రామ సభలు నిర్వహించకుండా ఏకపక్ష నిర్ణయాలతో 2022 అక్టోబరు 1న పోలింగ్ స్టేషన్‌లను ఎమ్మెల్యే లేఖ అధారంగా బూత్‌లను మార్చారన్నారు. 2022 అక్టోబరు 4న పోలింగ్ సేష్టన్‌లు మార్చవద్దని ఆర్డీవో, ఎంఆర్‌వో, కలెక్టర్‌లకు పలు పార్టీల నాయకులు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోకుండా పోలింగ్ స్టేషన్ మార్చడం జరిగిందన్నారు. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ మా విన్నపం పరిగణలోకి తీసుకొని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్ఎస్ఎన్ విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, జనవరి 8: ఎంఎన్‌సీ కంపెనీ టెక్నో బిజినెస్ సొల్యూషన్స్ కంపెనీకి ఎస్ఎస్ఎన్ కళాశాల డిగ్రీ విద్యార్థులు 26మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మల్లయ్య సోమవారం తెలిపారు. కంపెనీ ప్రతినిధి సీనియర్ హెచ్ఆర్ అమీర్ సోహెల్ రాత పరీక్ష, హెచ్ఆర్ రౌండ్ నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.3 లక్షలు వార్షిక వేతనం ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల పాలకవర్గం అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, డాక్టర్ ఎస్.సుధీర్, డాక్టర్ పీఎన్‌వీడీ మహేష్, డాక్టర్ బీవీఎస్‌కే శాస్త్రి, ఎస్.సురేష్‌బాబు అధ్యాపకులు అభినందించారు.

పేకాట, కోడిపందేలపై నిషేధం

వినుకొండ, జనవరి 8: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో ఎవరైనా పేకాట, కోడిపందేలు ఆడినట్లయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పట్టణ సీఐ సాంబశివరావు సోమవారం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేకాట, కోడిపందేలు నిషేధించడం జరిగిందని, ఆడిన, ఆడించిన వ్యక్తులపై కేసులు పెట్టి రిమాండ్‌కు పంపడం జరుగుతుందన్నారు. త్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి బండి నడిపే వారిపై ప్రత్యేక దృష్టిసారించడం జరుగుతుందన్నారు. పట్టణంలో 60సీసీ కెమేరాల ద్వారా గమనిస్తూ ఉండటం జరుగుతుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు.

ఆందోళన చేస్తున్న ఉద్యోగులపై ప్రభుత్వ వైఖరి సరికాదు

● సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్

నరరావుపేట టౌన్, జనవరి 8: సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఉద్యోగులపై ప్రభుత్వ వైఖరి సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరరావుపేటలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె సోమవారం 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ డిమాండ్లపై నిర్దిష్టమైన ఆదేశాలు ఇచ్చేంతవరకు సమ్మె కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో కామినేని రామారావు, సీపీఎం నాయకుడు బండారుపల్లి నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, పీ సాంబశివరావు, పీ రామకృష్ణ, జీ లాజర్, వెంకట్, శ్రీకాంత్, కోటేశ్వరరావునాయక్, కాంచన, రజిని, వై సుబ్బాయమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం కనిపించకుండా కుట్రపన్నారు

● డీబీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్‌కుమార్

నరసరావుపేట టౌన్, జనవరి 8: నరసరావుపేట పట్టణంలో అంబేద్కర్ విగ్రహం కనిపించకుండా కుట్రపన్నారని డీబీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్‌కుమార్ అన్నారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదా రమేష్‌కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని కనిపించకుండా వాణిజ్య, వ్యాపార సంస్థల ప్రకటనల కోసం యాడ్ ఏజెన్సీ పెద్ద హోర్డింగ్ ఏర్పాటు చేయడం, అందుకు మున్సిపల్ అధికారులు అనుమతి ఇవ్వడం మున్సిపాలిటీ అధికారుల కుట్రేనన్నారు. తక్షణమే ఏజెన్సీ వారి హోర్డింగ్ తొలగించాలన్నారు. లేని పక్షంలో ఈ నెల 14న నరరావుపేట గడియార స్తంభం వద్ద రోడ్డుపై దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి పోరాడుతుందని హెచ్చరించారు. నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో ప్రభుత్వ అనుమతులు ఉన్న యాడ్ ఏజెన్సీలు ఎన్ని ఉన్నాయో, అనుమతుల లేని హోర్డింగ్‌లు ఎన్ని ఉన్నాయో తెలియజేయాలన్నారు. పన్నులు కట్టకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండికొడుతున్న యాడ్ ఏజెన్సీలపై తక్షణమే చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో ఎస్.చిన్న, కొణతం బాబురావు, గుమ్మడి బాబూరావు తదితరులు ఉన్నారు.

అంతా చెత్తమయం

● ఉధృతంగా కొనసాగుతున్న సమ్మె
● డిమాండ్లు నెరవేర్చే వరకు పోరుబాటే
● 14వ రోజుకు కార్మికుల సమ్మె





నరసరావుపేట ఎన్‌జీవో కాలనీలో, బాలయ్యనగర్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు

నరసరావుపేట, జనవరి 8: మునిసిపాల్టీల్లో పారిశుధ్య కార్మికుల సమ్మె ఉధృతంగా కొనసాగుతుంది. సమ్మె సోమవారం 14వ రోజుకు చేరుకుంది. పురపాలక సంఘాల కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు. పెద్ద ఎత్తున కార్మికులు నిరవధిక సమ్మెలో ఉన్నారు. పట్టణాలలోని వీధులు కంపుకొడుతున్నాయి. ఎక్కడికక్కడ భారీగా వ్యర్థాలు పేరుకుపోయాయి. పారిశుధ్య పనులకు మునిసిపాల్టీలు చేపడుతున్న ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కార్మికులు ప్రతిఘటిస్తున్నారు. నరసరావుపేటలో ఆటోల ద్వారా ఇంటింటి నుంచి చెత్త సేకరణను కూడా అడ్డుకున్నారు. సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద కార్మికులు ధర్నా చేశారు. కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం పలుమార్లు జరిపిన చర్చలు విఫలం కావడంతో సమ్మెను మరింత ఉధృతం చేశారు. మునిసిపాల్టీలను నిరసనలతో హోరెత్తిస్తున్నారు.

సమ్మెలో 1,145 మంది పారిశుధ్య కార్మికులు

జిల్లాలోని నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, మాచర్ల, పిడుగురాళ్ళ, దాచేపల్లి, గురజాల, చిలకలూరిపేట పురపాలక సంఘాల్లో 1,145 మంది పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెలో ఉన్నారు. ఆయా మునిసిపాల్టీలలో కేవలం 183 మంది రెగ్యులర్ కార్మికులు మాత్రమే విధుల్లో ఉన్నారు. 16 శాతం మంది రెగ్యులర్ కార్మికులు పనిచేస్తుండటం, 84శాతం మంది కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో ఉండటంతో పారిశుధ్య పనులు మునిసిపాల్టీలలో స్తంభించిపోయాయి. ఇంటింటి నుంచి చెత్త సేకరణ పూర్తిగా నిలిచిపోయింది. ఇంటిలోని చెత్తను ప్రజలు వీధుల్లో పడేస్తుండటంలో అవి చెత్తమయం అవుతున్నాయి. కాలువల్లో పూడికతీత కూడా నిలిచిపోయింది. వ్యర్థాలతో పాటు, మురుగునీటి కష్టాలను పురాల పౌరుల ఎదుర్కొంటున్నారు. నరసరావుపేట మునిసిపాల్టీలో 256మంది కాంట్రాక్టులు సమ్మెలోకి వెళ్ళారు. చిలకలకలూరిపేట పురపాలక సంఘంలో 247మంది కాంట్రాక్టు కార్మికులు, వినుకొండలో 213, పిడుగురాళ్ళ, దాచేపల్లి, గురజాల పురపాలక సంఘాలలో 195, సత్తెనపల్లిలో 136మంది కార్మికులు సమ్మె చేస్తున్నారు. సమ్మె కొనసాగితే వ్యర్థాలు, మురుగునీటి వెతలు పట్టణాల్లో తీవ్ర కానున్నాయి.

ఎస్మా చట్టం ఉన్నా పోరాటం ఆపేది లేదు

అంగన్‌వాడీల హెచ్చరిక





వినుకొండలో దీక్షాశిబిరంలో నిద్రిస్తున్నట్లుగా, ఈపూరులో దండాలతో అంగన్‌వాడీల నిరసన

నరసరావుపేట టౌన్, జనవరి 8: బెదిరిస్తూ ఎస్మాను ప్రయోగించినా ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని, డిమాండ్లపై సానుకూలంగా స్పందించి పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీలు ముక్తకంఠంతో సోమవారం స్పష్టం చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరసరావుపేట గాంధీ పార్కు వద్ద నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 28వ రోజుకు, 24గంటల నిరవధిక సమ్మె 3వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ సమ్మెవిచ్ఛిన్న ఆలోచనలు మానుకొని సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపచేసేలా వ్యవహరించాలని ప్రభుత్వానికి హితవు పలికారు. మహిళా సాధికారిత, సంక్షేమం అంటూ ప్రగల్భాలు పలుకుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలు మహిళలు అనే విషయాన్ని మరిచిపోయి సమ్మెను అణిచివేసేందుకు ఎస్మా ప్రయోగించి తన నిరంకుశ వైఖరి చాటుకున్నారని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15వేలు వేతనం అమలుకు సన్నాహాలు చేస్తుందని, ఇదిచూసి జగన్‌మోహన్‌రెడ్డి మారాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు షేక్ సిలార్ మసూద్, కేపీ మెటిల్డాదేవి, శ్రామిక మహిళ కన్వీనర్ డీ శివకుమారి, కవిత, మాధవి, సాయి, నిర్మల, విజయలక్ష్మి, ఐలు రాష్ట్ర కమిటీ సభ్యుడు సీహెచ్ఎల్ఎన్ మూర్తి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బీ సలీమ్, బీఎస్పీ బూదాల బాబురావు, బీసీ సంక్షేమ సంఘం బాదుగున్న శ్రీను, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ, గోదా జాన్‌పాల్, ఏ సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: చిలకలూరిపేటలో అంగన్ వాడీలు స్థానిక గ్రంథాలయం వద్ద నిరసన దీక్షల్లో పాల్గొన్నారు. ఆయా సంఘాల నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు, జీ సావిత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని బెదిరింపులు చేసినా తాము భయపడే ప్రశక్తే లేదన్నారు. జిల్లా అంగన్‌వాడీ సంఘం కార్యదర్శి జీ మల్లీశ్వరి మాట్లాడుతూ ఎస్మా చట్టాన్ని ప్రయోగించినంత మాత్రాన తాము భయపడి పారిపోతామనుకోవటం భ్రమ అన్నారు. వివిధ సంఘాల నాయకులు వై రాధాకృష్ణ, వరహాలు, సీహెచ్ నిర్మల, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● ఈపూరు: అంగన్వాడీలను తొలగించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదని సీఐటీయూ జిల్లా నాయకుడు హనుమంతురెడ్డి అన్నారు. ఈపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద బొల్లాపల్లి, ఈపూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న ధర్నాలో పాల్గొని హనుమంతురెడ్డి మాట్లాడుతూ న్యాయమైన అంగన్వాడీల డిమాండ్‌లను పరిష్కరించే వరకు ఆందోళన చేస్తామన్నారు.

● వినుకొండటౌన్: ప్రభుత్వం ఇచ్చిన హామీలు 99 శాతం పూర్తి చేశామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు ఎలా మరిచారంటూ నిలదీశారు. స్థానిక సురేష్‌మహల్ రోడ్డులో అంగన్‌వాడీ కార్యకర్తలు 27వ రోజు సోమవారం దీక్షాశిబిరంలో నిద్రిస్తున్నట్లు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్షుడు హనుమంతరెడ్డితో పాటు న్యాయవాది సీహెచ్.ఎల్.ఎన్.మూర్తి పాల్గొని ఎస్మా చట్టం గురించి కార్యకర్తలకు వివరించారు. అంగన్‌వాడీలు భయపడాల్సిన అవసరం లేదని, కార్యకర్తలకు, ఆయాలకు పూర్తిస్థాయిలో సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుండా పోటీ కార్మికులతో పనిచేయించటం చట్ట వ్యతిరేకం

● మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్



కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

నరసరావుపేట టౌన్, జనవరి 8: సమస్యలు పరిష్కరించకుండా పోటీ కార్మికులతో పనిచేయించడం చట్టవ్యతిరేకం అని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు షేక్ సిలార్ మసూద్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న నిరవధిక సమ్మె 14వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం వద్ద నుంచి జిల్లా వ్యాప్తంగా వచ్చిన మున్సిపల్ కార్మికులు ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకొని తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు, అనందరం డీఆర్‌వో కే వినాయకంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల డిమాండ్లు పరిష్కరించకపోగా బెదిరింపులకు పాల్పడటం, అరెస్టులు చేయటం, పోటీ కార్మకులతో పనిచేయించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకుడు బూదాల బాబురావు,ర కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ సుందరయ్య, కృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, సీఐటీయు నాయుడు శ్రీనివాసరావు, డీ యోహాన్, టీ మల్లయ్య, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న మునిసిపల్ కార్మికులు

● చిలకలూరిపేట, జనవరి 8: చిలకలూరిపేట మునిసిపాలిటీ పరిధిలో మునిసిపల్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా స్థాని సీపీఐ కార్యాలయం వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేశారు. దీక్షా శిబిరం వద్దకు వచ్చి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను అన్ని వర్గాల ప్రజలు సానుభూతితో అర్థం చేసుకొని మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు నాగభైరు రామసుబ్బాయమ్మ, పేలూరి రామారావు, దాసరి వరహాలు, చెరుకుపల్లి నిర్మల, నాయుడు శివ కుమార్, బొంతా భగత్‌సింగ్, కొమరగిరి చెంచయ్య, యోగయ్య, అక్కులయ్య తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వినుకొండలో రాస్తారోకో

వినుకొండటౌన్, జనవరి 8: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్న మున్సిపల్ కార్మికులకు ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్మికులతో కలిసి రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్మికులు భిక్షాటన చేస్తూ ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జనసేన పార్టీ సమన్వయకర్త నాగశ్రీను ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు మున్సిపల్ కార్మికులకు సంఘీభావం తెలిపి ఆర్థికసాయం అందజేశారు.

రైతులను నట్టేట ముంచిన జగన్

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, జనవరి 8: రాష్ట్రంలో రైతాంగాన్ని నట్టేట ముంచి రైతుల ఆత్మహత్యలకు కారణమైన అరాచక వైసీపీ పాలనకు ప్రజలు బుద్ధి చెబుతారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. వ్యవసాయ శాఖను మూసివేసి ఉద్యానవన శాఖను సైకో జగన్‌రెడ్డి రోడ్డున పడవేశారన్నారు. కౌలు రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రోజుకు ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. దేశంలోనే రాష్ట్రం కౌలు రైతుల ఆత్మహత్యలలో రెండో స్థానంలో, రైతుల ఆత్మహత్యలలో మూడో స్థానంలో ఉండి, రైతు అప్పులలో మొదటి స్థానంలో ఉందని, ఇందుకు అసమర్థ జగన్‌రెడ్డి సిగ్గుపడాలన్నారు. రివర్స్ టెండర్ల పేరుతో ఇరిగేషన్ నాశనం చేశారని, రాష్ట్ర సీఎంకు రైతు సాగు కష్టం తెలియదని ఎద్దేవా చేశారు. టీడీపీ పాలనతో పట్టిసీమ చేపడితే జగన్‌రెడ్డి కక్షసాధింపుతో పాడుపెట్టడం దుర్మార్గమన్నారు. టీడీపీ పాలనతో ఉద్యోగాలు తెస్తే, జగన్‌రెడ్డి పాలనలో గంజాయి తెచ్చాడని, టీచర్ ఉద్యోగాలు ఇస్తే.. జగన్ వాలంటీర్ ఉద్యోగాలు, మటన్ మార్టు ఉద్యోగాలు ఇచ్చారని అన్నారు. ఫీజు రీయింబర్సమెంట్ తీసివేయటం, రైతు సబ్సిడీలు తొలగించడం, దళితులకు, బీసీలకు పథకాలు నిలిపివేసి వందకు పైగా సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేశారని విమర్శించారు.

ఇసుక, మట్టి, మద్యం, మాఫియాతో కోట్లు దోచుకుంటూ ప్రజలను మోసం చేస్తున్న సైకో జగన్‌రెడ్డి అరాచక పాలనను ప్రజలు గుర్తించారని, రానున్న ఎన్నికలలో బుద్ధిచెబుతారన్నారు.

22 వరకు న్యాయవాదులు విధులకు గైర్హాజరు

నరసరావుపేట లీగల్, జనవరి 8: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును నిరశిస్తూ రద్దు చేయాలని కోరుతూ చేస్తున్న దీక్షలు ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగించనున్నట్టు నరసరావుపేట న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గుంటూరులో సోమవారం నిర్వహించిన బార్ ఫెడరేషన్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్నారని, 22 వరకు న్యాయవాదులు జిల్లావ్యాప్తంగా విధులకు గైర్హాజరు కానున్నట్టు ఆయన తెలిపారు.

ఏపీ మోడల్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

రొంపిచర్ల, జనవరి 8: మండలంలోని రెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ రవినాయక్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని తెలిపారు. చిన్నారుల హరిదాసు వేషధారణలు ఆకట్టుకున్నాయి.

ఎస్‌వీ చార్ట్ అన్నదానం

బొల్లాపల్లి, జనవరి 8: మండలంలోని మూగచింతలపాలెం గ్రామానికి చెందిన పోకా వెంకటరావు ఎస్‌వీ ఓవర్‌సిస్ కన్సల్టెన్సీ స్థాపించి ఎస్‌వీ చార్ట్ ద్వారా మండల కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పారిశ్రామిక వేత్త ఆర్ఆర్ఆర్ మోడరన్ ఇండస్ట్రీస్ అధినేత కొల్లి రామారావు కుమార్తె రేణుశ్రీ చౌదరి జన్మదినం సందర్భంగా పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అన్నదాత కొల్లి రామారావును పలువురు అభినందించారు.

ఎన్నికల్లో టీడీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరు

● భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి



భవిష్యత్ గ్యారెంటీ పత్రాలు పంచుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 8: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని, తెలుగుదేశం, జనసేన కూటమి అధికారంలోకి రావటం ఖాయమని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తమ కూటమి గెలుపు రాష్ట్రానికి చారిత్రక అవసరమని, అదే రాష్ట్రానికి శ్రీరామరక్ష అన్నారు. పట్టణంలోని 13, 14, 17, 18 వార్డుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న పథకాల గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. అనంతరం తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం ఏర్పడాలని రాష్ట్ర ప్రజలు నిర్ణయానికి వచ్చారన్నారు. కార్యక్రమంలో నియోజక వర్గ జనసేన సమన్వయకర్త తోట రాజారమేష్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కళ్యాణి సెంటర్‌లో ఏర్పాటు చేసిన అన్నదానం

పేదల ఆకలి తీరుస్తున్న ప్రత్తిపాటి అన్న క్యాంటీన్

చిలకలూరిపేట అర్బన్, జనవరి 8: పట్టణంలోని కళ్యాణి సెంటర్‌లో కొనసాగుతున్న ప్రత్తిపాటి ఫౌండేషన్ అన్న క్యాంటీన్‌లో సోమవారం 620మంది నిరుపేదలు, యాచకులకు, వలస కూలీలకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ కరీం, షేక్ ఉమర్, షేక్ ఖాజా, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, జవ్వాజి బుచ్చిబాబు, ఉదయ్‌శంకర్‌సింగ్ తదితరులు పాల్గొని స్వచ్ఛందంగా సేవలు అందించారు.

చిన్నారుల మరణాలపై డీఎంహెచ్‌వో ఆరా

నాదెండ్ల, జనవరి 8: మండలంలోని తూబాడులో ఇద్దరు చిన్నారులు మరణించటం గ్రామంలోని ఎస్సీ కాలనీలో అలజడి రేపింది. ఆరేళ్ళ వయస్సు ఉన్న స్టీఫెన్ పాల్ తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ఆ బాలుడికి ప్రభుత్వం పింఛను కూడా అందిస్తోంది. కాగా శనివారం రక్తం తగ్గటంతో ఆ బాలుడు మృతి చెందాడు. కాగా ఆదివారం నూతక్కి అలెక్స్ అనే ఐదేళ్ళ బాలుడు మృతిచెందాడు. దీంతో గ్రామంలో డెంగీ, మరేదైనా వ్యాధి వ్యాపించిందా? అని గ్రామస్థులు ఆందోళన చెందారు. సమాచారం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవికుమార్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ సాయిశ్వేతలు గ్రామానికి వచ్చారు. ఆ ఇద్దరి చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించి మెడికల్ రిపోర్టులు పరిశీలించారు. మరికొన్ని నివేదికలు తీసుకు రావాలని అధికారులు సూచించారు. వారితో పాటు డీఎంవో రవీంద్ర రత్నాకర్ కూడా హాజరయ్యారు.

ల్యాండ్ అథారిటీతో రైతులకు నష్టం

నాదెండ్ల, జనవరి 8: ల్యాండ్ అథారిటీ టైట్లింగ్ చట్టంతో రైతులకు నష్టం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మాజీ ప్రధాన కార్యదర్శి బొట్లపాటి రామకోటేశ్వరరావు సోమవారం పేర్కొన్నారు. న్యాయవ్యవస్థతో సంబంధం లేకుండా ల్యాండ్ అథారిటీని ఏర్పాటు చేయటం వల్ల భూయజమానులకు భద్రత ఉండదన్నారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని ఈ చట్టాలను ఏపీ ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధపడటం దారుణమన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం



చిట్టాపురంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు, జనవరి 8: మండలంలోని చిట్టాపురంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం,హెల్త్ క్లినిక్‌లను సోమవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నానన్నారు. అనంతరం నూతనంగా మంజూరైన పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీ రంగనాయకులు, మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు, వైసీపీ నాయకులు శాఖమూరి బుచ్చయ్య, హనుమయ్య గోలి వెంకటేశ్వర్లు, గోపు వీరయ్య, కుమ్మెత శ్రీనివాసరెడ్డి, యాతకుంట ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడివరం మాజీ సర్పంచ్ పెద్దసుబ్బయ్య మృతి

● నివాళులర్పించిన జీవీ, మక్కెన తదితరులు



సుబ్బయ్య మృతదేహానికి టీడీపీ జెండాను కప్పి నివాళులర్పిస్తున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 8: మండలంలోని ఉమ్మడివరం గ్రామ మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వీరగంధం పెద్ద సుబ్బయ్య (65) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఉమ్మడివరం గ్రామానికి చేరుకొని సుబ్బయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ సుబ్బయ్య మరణం పార్టీకి తీరనిలోటన్నారు. గ్రామంలో 15సంవత్సరాలు సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషిచేసి అందరివాడిగా ప్రజల మన్ననలు పొందారన్నారు. సోమవారం ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. డీఎల్‌డీఏ చైర్మన్ లగడపాటి వెంకట్రావు, నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడలకు డ్రాలు

నూజెండ్ల, జనవరి 8: ఈ నెల 10నుంచి 20వ తేదీ వరకు జరగనున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల నిర్వహణకు డ్రా నిర్వహించారు. మొత్తం 15సచివాలయాల పరిధిలోని 150టీమ్‌లు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ పోటీల్లో పాల్గొనున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.జయరామిరెడ్డి, ఎంపీడీవో వీరభద్రాచారి, ఆడుదాం ఆంధ్రా మండల కో-ఆర్డినేటర్ ఎస్.వెంకటరత్నం పాల్గొన్నారు.

పది విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ

వినుకొండ, జనవరి 8: పట్టణంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో గంగినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో గంగినేని రాఘవ చేతుల మీదుగా 10వ తరగతి మోడల్ టెస్ట్‌పేపర్లను సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. అదేవిధంగా అబ్దుల్ కలామ్ థెరిసా సేవా సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, మహాత్మా జ్యోతిరావుపూలే పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు సొసైటీ వ్యవస్థాపకురాలు చందోలు నాగవాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని సూచించారు.